TGTEL/25/A3750

... నిజమే ...

# నిజాయితి

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

"నిజాయితీ" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం ఇది విశ్వసనీయత, విధేయత మరియు సమగ్రతను పెంచుతుంది.

ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య సంపుటి 1 సంచిక 38 ప్రింటర్ : గుండూర్ శ్యామ్ . గురువారం 25 డిసెంబర్ 2025 వెల 4:00

## కెసిఆర్‌కు అధికారం రానివ్వను



**కొడంగల్ / హైదరాబాద్, డిసెంబర్ 24 (నిజాయితి) :**
నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం కల్వకుంట్ల ఫ్యామిలీని అధికారంలోకి రానివ్వనని బిఆర్ఎస్, కేసీఆర్ చరిత్ర ఇక ఖతమే కొడంగల్ సాక్షిగా ఇదే నాశపథమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 2029 ఎన్నికల్లో 119 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 80కు పైగా, 150 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 100కు పైగా స్థానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తా... కొడంగల్ వేదికగా సవాల్ విసురుతున్నా... చేతనైతే కాస్కో బిడ్డా అని కెసిఆర్‌పై ముఖ్యమంత్రి తీవ్ర స్థాయిలో బుధవారం నారాయణపేట్ జిల్లా కోస్గి పట్టణంలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్‌లో కొడంగల్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైనా సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు ఆత్మీయ సమ్మేళనం సన్మాన కార్యక్రమాల్లో సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొని సర్పంచులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సిఎం మా ట్లాడుతూ గత పదేళ్లలో ఒక్క ప్రాజెక్టు పూర్తి కాలేదని తొడుక్కోవడానికి చెప్పులు, వేసుకోవడానికి బట్టలు లేని వాళ్లకు వేల కోట్ల ఆస్తులు వచ్చాయే తప్ప పాలమూరుకు నీళ్లు రాలేదన్నారు. పడావు పడ్డ ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పనులు మొదలయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉ న్నట్లు పదేళ్లలో వాళ్లు చేసిన అప్పులు మన ముందు ఉన్నాయని అన్నారు. ఫామ్‌హౌస్‌లో బందీగా మారి న కెసిఆర్ వాళ్ల పాపాన వారు పోతారని ఊరుకున్నా చాలా రోజుల తరువాత బయటకు వచ్చి తోలు తీస్తానని మాట్లాడుతున్నాడని మా సర్పంచులు చీరి చింతకు కట్టి చింతమడకకు పంపిస్తారన్నారు. ఒక్కటైనా ప్రజలకు పనికొచ్చే మాటలు మాట్లాడలేదని, పదేండ్లు పాలమూరుపై పగబట్టి పాలమూరు అభివృద్ధిని అడ్డుకున్నాడు.

మటన్ కొట్టు మస్తాన్‌కు చెప్తా అక్కడకు వెళ్లి తోలు తీయమని విమర్శించారు. మాకు మాటలు రాక కాదు మర్యాద ఉండదని మాట్లాడటం లేదని రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా అంటున్నావ్ ఇదేం దుబాయ్ పాస్ పోర్ట్ బ్రోకర్ దందా కాదన్నారు. మేం కక్ష రాజకీయాలు చేయమని ఎవరి పాపాన వాళ్లే పోతారని, మా పని మేం చేసుకుంటున్నామని, అయినా మా జోలికి వస్తే మా కార్యకర్తలు ఊరుకోరాని అన్నారు. కొడంగల్ వేదికగా సవాల్ విసురుతున్నా 2029 ఎన్నికల్లో 119 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 80కు పైగా,150 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగే 100కు పైగా స్థానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తా.. ఇదే నా సవాల్ చేతనైతే కాస్కో బిడ్డా నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం రాబోయే ఎన్నికల్లో కెసీఆర్‌కు అధికారం ఇక కల్లనే అని బీఆర్ఎస్, కేసీఆర్ చరిత్ర ఇక ఖతమే కొడంగల్ సాక్షిగా ఇదే నా శపథమన్నారు. పది మందిని వెనకేసుకుని పొంకనాలు కొట్టుడడం కాదు అసెంబ్లీలో చర్చిద్దాం రా ఏ అంశంపై అయినా అసెంబ్లీలో చర్చించేందుకు మేం సిద్ధం రండి అని అన్నారు. సొంత చెల్లిలి భర్త ఫోన్ ట్యాపింగ్ చేశారని వాళ్ళింటి ఆడబిడ్డనే చెబుతోందని, సొంత చెల్లెలికి సమాధానం చెప్పలేని కేటీఆర్ నాకు సవాల్ విసురుతున్నాడని మీ గ్రాంఢ్రిపులకు, బెదిరింపులకు భయపడేది లేదన్నారు.దేశ పునాదులు గ్రామాల్లో ఉన్నాయని మహాత్మాగాంధీ అన్నారని, గ్రామాలు అభివృద్ధి చెందితే రాష్ట్రాలు, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజాపాలనతో మారుమూల ప్రాంతాలు, తండాలు,గ్రామాల్లోని సంక్షేమ పథకాలు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని అన్నారు. ఎన్నికలప్పుడే పార్టీలు పంతాలు ఎన్నికలు ముగిసాయి. ఇక పార్టీలు పంతాలు లేకుండా అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని పోదామన్నారు.

మన కొడంగల్ నియోజకవర్గంలో ఎవరిపై వివక్ష చూపొద్దు చిన్న చిన్న సమస్యలు ఉంటే పక్కన పెట్టి గ్రామ కక్షలకు తావు లేకుండా నియోజకవర్గంలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. నిండు మనసుతో మీరు ఆశీర్వదించి గుండెల్లో పెట్టుకోవడం వల్లే ముఖ్యమంత్రి హోదాలో మీ ముందు నిలబడ్డానని, కొడంగల్ నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. రాష్ట్రంలోనే లేని సైనిక్ స్కూల్‌ను లగచర్లకు తీసుకొచ్చామని 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్‌ను కొడంగల్‌లో కడతామన్నారు.దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకోవాలి అన్నారు. కొడంగల్ వేదికగా రాష్ట్రంలోని గ్రామ సర్పంచులకు త్వరలోనే ప్రత్యేక నిధులు చిన్న గ్రామాలకు రూ.5 లక్షలు,పెద్ద గ్రామాలకు రూ.10 లక్షలు మంజూరు చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే, ఎంపిలు, మంత్రులకు సంబంధం లేకుండా ప్రతి గ్రామ పంచాయతీకి సిఎం ప్రత్యేక నిధుల నుంచి జమ చేస్తామని సర్పంచుల గౌరవం పెంచాలనే ఈనిర్ణయం తీసుకున్నమన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల్లో రేషన్ కార్డులు లేని వారి పేర్లు, ఉచిత కరెంటు లేని వారి పేర్లు, ఇందిరమ్మ ఇల్లు రాని వారికి, రైతు భరోసా రాని రైతుల పేర్లు రాసుకుని ఇస్తే అర్హులైన అందరకీ ఆయా పథకాలను అందిస్తామన్నారు. కోటి మంది ఆడ బిడ్డలకు సారే పేరిట చీర ఇస్తున్నాం.. ఇంకా ఎవరికైనా చీర అందకపోతే ఇవ్వాలని అందేలా చర్యలు తీసుకోవాలని సిఎస్,కలెక్టర్లను ఆదేశించారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

### సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి



**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 24 (నిజాయితి) :**
డిసెంబర్ 26న నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి, ఫయాజ్ పిలుసునిచ్చారు.

సిపిఐ 100 సంవత్సరాల వేడుకలు ఈనెల 26న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఉదయం 10 గంటలకు భారీ ర్యాలీ ప్రదర్శన ఉంటుందని ఆయన ఈ మేరకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రదర్శన తర్వాత బస్టాండ్ కూడలిలో ఉన్న సిపిఐ పార్టీ శాస్వత దిమ్మెపై జెండా ఆవిష్కరణ చేయడం జరుగుతుందని, అక్కడే కార్నర్ మీటింగ్ నిర్వహించడం జరుగుతుందని పత్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఎం బాలనరసింహ హాజరు అవుతున్న కారణంగా పార్టీ శ్రేణులు జిల్లా పరిధిలోని సిపిఐ గ్రామ శాఖల మండల శాఖలు, డివిజన్ శాఖల కార్యదర్శులు, సబ్యులు, కార్యకర్తలు పార్టీ అభిమాను, సానుభూతి పరులు సామాన్య ప్రజానీకంతో సహా విధిగా అధిక సంఖ్యలో హాజరై సిపిఐ పార్టీ వంద సంవత్సరాలుగా చేసిన పోరాటాల నేపథ్యాన్ని అర్థం చేసుకొని నేటికీ తీరని సమస్యలతో తమ జీవితాలను నెట్టుకొస్తున్న ప్రజలకు బాసటగా సిపిఐ తీసుకోబోయే భవిష్యత్ పోరాటాల పరంపరకు ఎర్ర జెండా సాక్షిగా ముందుకు సాగేందుకు అవసరమైన శక్తిని కూడగట్టుకునే ఈ ఉత్సవ సంర్భాన్ని మరింత ఎరుపెక్కించాలని ఈ ప్రకటనలో ఎస్ఎండి ఫయాజ్ పిలుపునిచ్చారు.

## వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీగా మేడిశెట్టి రామకృష్ణ



**మహబూబ్‌నగర్, డిసెంబర్ 24 (నిజాయితి) :**
వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీగా మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల కు చెందిన మేడిశెట్టి రామకృష్ణ నియామకం అయ్యారు.

వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వైష్ట కన్వెన్షన్ శంషాబాద్‌లో ఆదివారం ఇంటర్నేషనల్ కన్వెన్షన్ నిర్వహించారు. ఈ సమావేశంలో 2026 సంవత్సరానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో జడ్చర్ల కు చెందిన మేడిశెట్టి రామకృష్ణ ను ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరి గా నియమించారు. రామకృష్ణ సేవలకు మెచ్చి ఈ నియామకం చేపట్టడం జరిగిందని ఇంటర్నేషనల్ అధ్యక్షులు సిద్ద సూర్యప్రకాష్ రావు తెలిపారు. రామకృష్ణ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## చిల్లర డైలాగులతో చిందులు

**హైదరాబాద్, డిసెంబర్ 24 (నిజాయితి) :**
నీటి హక్కులపై రాజీపడ్డ నిర్వాకాన్ని బయటపెడితే తట్టుకోలేక చిల్లర డైలాగ్‌లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిందులు తొక్కుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. తిట్లు, బూతులతో డైవర్షన్ డ్రామాలు, తమాషాలు ప్రతీసారి నడవవని హితవు పిలికారు. జనం అన్నీ గమనిస్తున్నారని, సందర్భం వచ్చినప్పుడు తొక్కి నార తీస్తారని పేర్కొన్నారు. ఆస్తి కోసం సొంత చెల్లిని మెడలు పట్టుకుని బయటకు నెట్టిన వ్యక్తి కేటీఆర్ అని, ఆమెకే సమాధా నం చెప్పలేనోడు తనకు సవాలు విసురుతుండటం విడ్డూరంగా ఉందని కోస్గి సభలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 'ఎక్స్' వేదికగా కౌంటర్ ఇచ్చారు. జల హక్కులను కాపాడటం చేతకాక పెద్ద నోరేసుకోని అహంకారంతో అరుస్తున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు ప్రాజెక్టు గొంతుకోసి సొంత జిల్లానే దగా చేస్తున్నది చాలక కారుకూతలు కూస్తున్నరని ధ్వజమెత్తారు. తెలంగాణ సోయిలేని..రాష్ట్ర ప్రయోజనాలను రక్షించలే ని కోవర్ట్ బతుకు అని రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. అడ్డంగా దొరికిపోవడం..ఆగమాగం కావ డం.. అడ్డదిడ్డంగా వాగడం నీకు అలవాటే కదా అంటూ కేటీఆర్ సెటైర్లు వేశారు.



విధ్వంసక పాలనతో ప్రజలను చావ గొడుతున్నారని, వికృత మనస్తత్వంతో చావులు కోరుతున్నావా అని ఆక్షేపించారు. సభ్యత, సంస్కారం లేని నీచమైన వాగుడును చూసి జనం చీదరించుకుంటున్నా.. ఛీకొడుతున్నా ఇంకా మారలేదన్నారు. పట్టపగలు నోట్ల కట్టలతో దొరికిపోయిన ఓటుకు నోటు కేసులో దొరికిపోయి పనికిమాలిన శపథాలు చేయడం..పత్తా లేకుండా పారిపోవడం వెన్నతో పెట్టిన విద్య కదా అంటూ కెటిఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. శాసనసభలో, జనసభలో ప్రతిచోటా కాంగ్రెస్ జల ద్రోహాన్ని ఎండగడతామని అన్నారు. పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రానికి నష్టం జరగకపోతే చూస్తు ఊరుకోమని, పౌరుషం గల బిడ్డలం ప్రశ్నిస్తామని అన్నారు. ఆత్మగౌరవం లేని ఢిల్లీ బానిసలం తాము కాదని, రైతన్నల హక్కులకు భంగం కలిగితే భగ్గున మండుతామని హెచ్చరించారు. 2028లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని.. మళ్లీ వందేండ్ల దాకా పుట్టగతులు లేకుండా పాతిపెట్టడం తథ్యమని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్‌కు ఆహ్వానం



**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 24 (నిజాయితి) :**
శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం గోవింద క్షేత్రం హౌసింగ్ బోర్డ్ నాగర్ కర్నూల్ ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఈరోజు ఉదయం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గారిని ఆహ్వానించడం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు తీగల సునీంద్ర కార్యదర్శి నాగరాజు ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణ కోశాధికారి కందూరి బాలరాజు జాయింట్ సెక్రెటరీ ప్రశాంత్ రెడ్డి ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ నాగం చంద్రమోహన్ రెడ్డి పెద్దపులిసుధీర్ సాయిబాబు దశరథం ప్రసాద్ పాల్గొన్నారు

## బతికుండగానే రూ.12 లక్షలతో సమాధి



**జగిత్యాల, డిసెంబర్ 24 (నిజాయితి) :**
బతికుండగానే రూ.12 లక్షలతో సమాధి.
తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా లక్ష్మీపురం గ్రామానికి చెందిన నక్క ఇంద్రయ్య (80) బతికుండగానే తన కోసం రూ.12 లక్షల వ్యయంతో సమాధిని నిర్మించుకున్న ఘటన ఆసక్తికరంగా మారింది.
ఇంద్రయ్య గతంలో మరణించిన తన భార్య సమాధి పక్కనే తనకు కూడా సమాధిని నిర్మించుకున్నారు. జీవితంలో చివరి దశకు సిద్ధంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు.
ఇంద్రయ్య రోజూ తన సమాధి వద్దకు వెళ్లి కొంత సమయం గడుపుతూ, ప్రశాంతంగా కూర్చుని ధ్యానం చేస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ ఘటన ప్రస్తుతం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

### నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవం ప్రజలకు, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు

### కిస్మస్‌ను భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలి -ఎంపీ మల్లురవి ఆకాంక్ష

## కరుణ, ప్రేమల కలయికే క్రిస్మస్ పండుగ

తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లురవి

### లోక రక్షకుడు యేసుక్రీస్తు జన్మదినోత్సవం క్రిస్మస్ - ఎంపీ వ్యాఖ్య



**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 24 (నిజాయితి) :**
నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజక`వర్గ ప్రజలందరూ క్రిస్మస్‌ను ఆనందో త్సాహాల మధ్య జరుపుకోవాలి క్రైస్తవ సోదర, సోదరీమణులకు ఎంపీ మల్లు రవి ప్రత్యేక శభాకాంక్షలు తెలిపారు.
యేసు ప్రభువు బోధించిన ప్రేమ, కరుణ, శాంతి మార్గంలో నడవాలి – ఎంపీ
క్రిస్మస్ ప్రజల జీవితాల్లో సుఖ శాంతులు నింపాలి ఎంపీ ఆశయం కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి క్రిస్మస్ వేడుకలు జరుపుకోవాలి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజక వర్గ ప్రజలందరికీ క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ డాక్టర్ మల్లురవి

# ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం.

## గద్వాల జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్




**గద్వాల, డిసెంబర్ 24 (నిజాయితి) :**
బ్యాంకింగ్ లావాదేవీలను సమర్థవంతంగా నిర్వహించుకోవడానికి, తాము కృషి చేస్తున్న రంగాల్లో ప్రగతి సాధించేందుకు ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు.
ఫైనాన్షియల్ రంగంలో క్లైమ్ చేయని ఆస్తులను సమర్థవంతంగా మరియు త్వరగా పరిష్కరించడానికి ఉద్దేశించిన మీ డబ్బు మీ హక్కు కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బుధవారం గద్వాల ఐడిఓసి మీటింగ్ హాల్లో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్లు, ఇంతకంటే ఎక్కువ సంవత్సరాలుగా వివిధ బ్యాంకుల్లో, ఇన్సూరెన్స్, తదితర కంపెనీల్లో ఖాతాదారులకు సంబంధించిన క్లైమ్ చేయబడకుండా ఉండిపోయిన డిపాజిట్లను తిరిగి పొందేందుకు, ఆయా ఖాతాలను మళ్లీ పునరుద్ధరించుకోవడానికి ఈ కార్యక్రమం సువర్ణ అవకాశంగా కలెక్టర్ పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో సుమారు లక్షకు పైగా ఖాతాలకు చెందిన రూ.16.39 కోట్ల క్లైమ్ చేయని డిపాజిట్లు ఉన్నాయని, వీటిని తిరిగి చెల్లించేందుకు ఆర్.బి.ఐ అధికారులు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్బిఐ జనరల్ మేనేజర్ సుప్రభాత్, యుబిఐ జోనల్ హెడ్ అరవింద్ కుమార్, డీజీఎం సత్యనారాయణ, నాబార్డ్ డిడిఎం మనోహర్ రెడ్డి, ఎల్డిఎం శ్రీనివాసరావు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, భీమా రంగ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వాసికి సైన్స్ లో ప్రతిష్టాత్మక అవార్డ్.




**వనపర్తి, డిసెంబర్ 24 (నిజాయితీ) :**
వనపర్తి పట్టణం కు చెందిన పగడాల అలివేలు,గోపాల్ ల కుమార్తె డా. పగిడాల సౌజన్య బుధవారం తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టీ ఎ ఎస్)నుండి ఐ ఐ టి, హైదరాబాద్ డైరెక్టర్ చేతుల మీదుగా అసోసియేట్ ఫెలో అవార్డ్ ను అందుకున్నారు. ఈ అవార్డ్ ను సైన్స్ లో చేసిన పరిశోధనలకు గుర్తింపుగా టి ఎ ఎస్ నుండి వివిధ సైన్స్ రంగాలలో విశిష్ట ప్రతిభ కనబరచిన వారికి ఇవ్వడం జరుగుతుంది. ఈ సంవత్సరం ఇందులో భాగంగా సౌజన్య కు అసోసియేట్ ఫెలో గా గుర్తింపు లభించింది. ఈ అవార్డ్ తీసుకోవడం తనకెంతో గర్వకారణ మన్నారు. ఈ అవార్డ్ రావడానికి ముఖ్య కారకులైన ప్రొఫెసర్ ఎంవి రమణా రెడ్డి, డా.పవన్ కుమార్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఆయిల్ పామ్ సాగుకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి, డిసెంబర్ 24 (నిజాయితి) :**
జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆయిల్ పామ్ సాగు లక్ష్యాల అంశంపై ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఆయిల్ ఫామ్ సాగుకు సంబంధించి ప్రభుత్వం నుంచి 3500 ఎకరాల విస్తీర్ణం లక్ష్యం నిర్దేశించబడిందని చెప్పారు. కానీ సంబంధిత శాఖల అధికారులు సరైన విధంగా దృష్టి సారించకపోవడం కారణంగా లక్ష్యాలను చేరుకోలేకపోతున్నట్లు చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి 5 ఎకరాల పైబడి భూమి కలిగి ఉండి బోరు సదుపాయం ఉండి, ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి కలిగి ఉన్న రైతులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సదరు రైతులను గుర్తించి వారి జాబితాను ఉద్యాన శాఖకు అప్పగించాలని ఆదేశించారు. రాబోయే వారం రోజుల్లో ఈ ప్రక్రియను వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిచేయాలని ఆదేశించారు.
వరి కన్నా ఆయిల్ పామ్ సాగు చేయడం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వారికి తెలియజేసి అవగాహన కల్పించాలని ఆదేశించారు. తద్వారా రైతులు ఆ పంటకు వెళ్లడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ప్రియునిక్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్న ఫ్యాక్టరీ పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని సదరు కంపెనీ అధికారులను కలెక్టర్ నిలాదీశారు. ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయకపోతే రైతుల్లో సాగు చేసేందుకు భరోసా ఏ విధంగా కనిపించగలమని ప్రశ్నించారు. త్వరితగతిన ఫ్యాక్టరీ నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా కంపెనీ యాజమాన్యానికి తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా రైతులు రబీ సీజన్లో దొడ్డు రకం ధాన్యం వేయకుండా సన్న రకం ధాన్యానికి బోనస్ సదుపాయం ఉందని తెలియజేసి సన్న రకం వరి ధాన్యాన్ని సాగు చేసే విధంగా సూచనలు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖ ఏడి దామోదర్, విద్యాశాఖ అధికారి విజయభాస్కర్ రెడ్డి, ఎంఏవోలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అందరి భాగస్వామ్యంతో క్షయను నిర్మూలించాలి

## జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్



**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 24 (నిజాయితి):**
అందరి భాగస్వామ్యంతో ప్రజలందరూ సహకరిస్తేనే క్షయ వ్యాధిని అంతం చేయగలమని
జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్ గారు తెలిపారు. ప్రధానమంత్రి టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు నాగర్ కర్నూల్ పట్టణం లో ఈదమ్మ గుడి, మరియు రామాలయం దగ్గర క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈదమ్మ గుడి దగ్గర 112 మంది క్షయవ్యాధి అనుమానితులకు, రామాలయం దగ్గర 82 మందికి
ఎక్స్ - రే పరీక్షలు నిర్వహించారు. ఏ ఎన్ ఏం లు, ఆశా కార్యకర్తలు ముందస్తుగా టిబి సోకే అవకాశం గల మద్యపానం %ఆ% ధూమపానం చేసేవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, వయోవృద్ధులు, ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్న క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు తదితరుల జాబితాను తయారుచేసి శిబిరం నిర్వహించడానికి ఒకరోజు ముందస్తుగా సమాచారం అందించి , వారిని శిబిరానికి తరలించి తప్పకుండా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ విధంగా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం వల్ల , ప్రాథమిక దశలోని క్షయ వ్యాధి గ్రస్తులను గుర్తించి వెంటనే చికిత్స అందించడం వల్ల క్షయ వ్యాధి వ్యాప్తిని అరికట్టగలమని, ప్రజలందరి భాగస్వామ్యం కావాలని డి ఎం హెచ్ ఓ గారు జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తదనంతరం క్షయ వ్యాధిగ్రస్తుల ఇంటికి వెళ్లి వారు తీసుకుంటున్న మందులను పరీక్షించి, న్యూట్రిషన్ కిట్ వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రఫిక్, వైద్యాధికారి డాక్టర్ వాణి, ఎం ఎల్ హెచ్ పి కీర్తన,సి హెచ్ ఓ మినహాజ్, ఎస్ టి ఎస్ శ్రీను, ఆరిఫ్, ఎ ఎన్ ఎం సరస్వతి, జి జె కవిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి రుణ మాఫీ కోసం భర్త హత్య

## రోడ్డు ప్రమాదంగా చిత్రించేందుకు యత్నం భార్య సహా ముగ్గురు అరెస్ట్

## బోడ మంచ్య తండాలో ఉద్రిక్తత

**మహమూదబాద్, డిసెంబర్ 24 (నిజాయితి) :**
మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బోడ మంచ్య తండాలో ఇంటి రుణం మాఫీ కోసం ఓ ఇల్లాలు భర్తను హత్య చేసి, రోడ్డు ప్రమాదంగా చిత్రించేందుకు యత్నించిన ఘటన చోటుచేసుకుంది. ఈ కేసులో మృతుడి భార్య సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు.
తండాకు చెందిన భూక్య వీరన్న (45) అనే ట్రాక్టర్ డ్రైవర్‌ను కొందరు పథకం ప్రకారం తలపై బలమైన ఆయుధంతో కొట్టి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. అనంతరం మృతదేహాన్ని రోడ్డు పక్కన ఉంచి, పక్కనే మోటార్ సైకిల్ పెట్టి రోడ్డు ప్రమాదంగా చూపించే ప్రయత్నం చేశారు. అయితే మృతదేహంపై గాయాలు ఉండడం, వాహనానికి ఎలాంటి నష్టం లేకపోవడం, రక్తపు మరకలు కనిపించడంతో అనుమానం వచ్చిన మృతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
పోలీసుల దర్యాప్తులో వీరన్న భార్య, తండాకు చెందిన బోడ బాలు, ఆర్.ఎం.పి వైద్యుడు భరత్ కలిసి ఈ హత్యకు పాల్పడినట్లు నిర్ధారణ అయింది. వీరన్నకు ఉన్న గృహ రుణం కారణంగా అతని మరణంతో రుణం మాఫీ అవుతుందని, అలాగే అక్రమ సంబంధానికి అడ్డంకి తొలగిపోతుందన్న ఉద్దేశంతో ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.
ఈ విషయం తెలుసుకున్న తండావాసులు నిందితులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆర్.ఎం.పి భరత్ క్లినిక్‌ను ధ్వంసం చేసి, అతని మోటార్ సైకిల్‌ను దగ్ధం చేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన పోలీసులను అడ్డుకుని రాళ్లతో దాడి చేయడంతో కేసముద్రం రెండవ ఎస్ఐ నరేష్, కానిస్టేబుల్ నరేష్‌కు గాయాలయ్యాయి.
సమాచారం అందుకున్న మహబూబాబాద్ పోలీసులు అదనపు బలగాలతో అక్కడికి చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. సంఘటన స్థలాన్ని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కేసముద్రం సీఐ సత్యనారాయణ, ఎస్ఐ క్రాంతి కిరణ్ తెలిపారు. పోలీసులపై దాడి చేసిన వారిపై కూడా కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.
ప్రస్తుతం బోడ మంచ్య తండాలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి బందోబస్తు కొనసాగుతోంది.

# వినియోగదారులు తమ హక్కులు తెలుసుకోవాలి




**వనపర్తి, డిసెంబర్ 24 (నిజాయితి) :**
జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వనపర్తి జిల్లా కలెక్టరేట్లోని సివిల్ సప్లై కార్యాలయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి విశ్వనాథం, జగన్మోహన్ పాల్గొని వినియోగదారుల హక్కులు, ప్రభుత్వ డిజిటల్ సేవల వినియోగం, ఆన్‌లైన్ లావాదేవీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వినియోగదారులు తమ హక్కులను తెలుసుకొని మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.
అలాగే వినియోగదారుల ఫిర్యాదుల నమోదు విధానం, వినియోగదారుల ఫోరంల ద్వారా పరిష్కారాలు పొందే మార్గాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల ఫోరం, క్యాట్కో తరపున ప్రతాపరెడ్డి, కొమ్ము వెంకటేష్ పాల్గొన్నారు. కొమ్ము చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు, చైర్మన్ కొమ్ము వెంకటేష్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై విద్యార్థులు, సామాన్య ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో వినియోగదారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అధికారుల నుండి సమాచారం పొందారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని పాల్గొన్నవారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# హాస్టల్ విద్యార్థులకు చలి కోటు, మంకీ క్యాప్‌లు




**తెల్కపల్లి, డిసెంబర్ 24 (నిజాయితి):**
తెల్కపల్లి మండల కేంద్రంలోని ఎస్‌సి హాస్టల్ విద్యార్థులకు బుధవారం నాడు చలి కోటు, మంకీ క్యాప్‌లను హాస్టల్ వెల్ఫేర్ అధికారి పి.రామస్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎస్‌ఓ మాట్లాడుతూ హాస్టల్‌లో ఉన్న మొత్తం 85 మంది విద్యార్థులకు సరిపడ చలికోట్లు మరియు మంకీ క్యాప్‌లను షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ నాగర్‌కర్నూల్ జిల్లా అధికారి డిఎస్‌సిఓ ఉమాపతి వారి కార్యాలయం నుండి పంపించినట్లు తెలిపారు. ప్రభుత్వం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా ఎప్పటికప్పుడు హాస్టల్ విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా దుస్తులు, దుప్పట్లు, పుస్తకాలు, నోటు పుస్తకాలు తదితర అన్ని రకాల వస్తువులను సకాలంలో అందిస్తున్నదని హెచ్‌ఎస్‌ఓ రామస్వామి వివరించారు.

# డీటీఓ కార్యాలయంపై ఏసీబీ తనిఖీలు చేయాలి

## బిఎస్పీ జిల్లా జోనల్ ఇంచార్జ్ పృథ్వీరాజ్




**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 24 (నిజాయితి) :**
నాగర్‌కర్నూల్ జిల్లా డీటీఓ కార్యాలయంపై కూడా ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పీ) నాగర్ కర్నూల్ జిల్లా జోనల్ ఇంచార్జ్ పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీటీసీ కిషన్ నాయక్ ఏసీబీ దాడుల్లో పట్టుబడటం శోచనీయమన్నారు. ఒక సాధారణ డీటీసీ వద్ద రూ.300 కోట్లకు పైగా ఆస్తులు ఎలా సమకూరాయని ప్రశ్నించారు. సమాజం ఏ దిశగా వెళ్తోందోనన్న ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోనే డీటీసీ కిషన్ నాయక్‌పై రవాణా శాఖ విజిలెన్స్ విభాగంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పుడు అదే అధికారి ఏసీబీ దాడుల్లో పట్టుబడటం తమ ఆరోపణలకు బలం చేకూర్చిందన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కార్యాలయంలో ఉన్నతాధికారిగా ఉండి కిషన్ నాయక్ ఆధిపత్యం చెలామణి చేశారని ఆరోపించారు.
అలాగే నాగర్ కర్నూల్ జిల్లా డీటీఓ కార్యాలయంలో అధికారిక ఉత్తర్వులు లేకుండానే ఒక ఏఓ పదేళ్లుగా ఒకే చోట విధులు నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా డీటీసీ, జిల్లా డీటీఓ పూర్తిగా సహకరించారని ఆయన ఆరోపించారు. జిల్లా డీటీఓ కార్యాలయంపై అనేక ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల సమయంలో వాడుకున్న వాహనాలకు ఇంకా పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించలేదని, డిమాండ్ డ్రాఫ్ట్‌లను రీసైకిల్ చేశారని, పాత ట్రాక్టర్ ట్రాలీలను కొత్తవిగా రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు చేశారు. ఈ అంశాలపై నిజాలు బయటకు రావాలంటే నాగర్ కర్నూల్ జిల్లా డీటీఓ కార్యాలయంపై కూడా ఏసీబీ తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.
నాగర్ కర్నూల్ జిల్లా డీటీఓ కార్యాలయంలో జరుగుతున్న అనధికార కార్యకలాపాలపై రాష్ట్ర విజిలెన్స్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేసినట్లు పృథ్వీరాజ్ తెలిపారు.

# డీజీపీ నియామక ఉత్తర్వులు రద్దుకు నిరాకరించిన హైకోర్టు

**హైదరాబాద్, డిసెంబర్ 24:** రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి నియామక ఉత్తర్వులు రద్దు చేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. రెండు వారాల్లోగా డీజీపీల ప్యానెల్ లిస్టును యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)కి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా డీజీపీ ఎంపిక ఉండాలని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ప్యానెల్ లిస్టును యూపీఎస్సీకి పంపిన తర్వాత కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను జనవరి 20వ తేదీకి వాయిదా వేసింది. ఇటీవల తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఈ నియామకాన్ని హైదరాబాద్‌కు చెందిన సోషల్ వర్కర్ టి. మధన్ గోపాల్ రావు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వం జారీ చేసిన డీజీపీ




నియామక ఉత్తర్వులు 2018 నాటి సుప్రీంకోర్టు జారీ చేసిన గైడ్ లైన్స్‌కు పూర్తి వ్యతిరేకమంటూ పిటిషనర్ వ్యక్తిగతం హాజరై ఈ కేసును హైకోర్టులో వాదించారు. డీజీపీ పదవి విరమణకు కనీసం 3 నెలల ముందుగానే యూపీఎస్సీకి రాష్ట్ర ప్రభుత్వం డీజీపీ భర్తీ వివరాలను సమర్పించాల్సి ఉందన్నారు. అర్హులైన ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దాంతో శాశ్వత నియామక ప్రక్రియ ఆగిందని వివరించారు. అనంతరం ఈ పిటిషన్‌పై హైకోర్టు పలుమార్లు విచారణ జరిపింది. తాజాగా డీజీపీ నియామక ఉత్తర్వులు రద్దు చేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ వార్నింగ్

**కరీంనగర్, డిసెంబర్ 24:**
గ్రామ పంచాయతీలకు నెలరోజుల్లోగా నిధులు విడుదల చేయాలని.. లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచుతామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. రెండేళ్లుగా రాష్ట్రంలోని పంచాయతీలకు నిధులు ఇవ్వలేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. బుధవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. పంచాయితీలకు ఇచ్చిన నిధులన్నీ కేంద్రానివే అని స్పష్టం చేశారు. పంచాయతీలకు ఇచ్చిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ రాకముందే.. నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఇటీవల తెలంగాణలో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక గ్రామ పంచాయతీలను గెలుచుకుంది. గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు.. మంగళవారం బాధ్యతలు



చేపట్టారు. అయితే ఈ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్.. రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదీకాక.. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు సర్కార్ కసరత్తు చేస్తుంది. వీటిని సంక్రాంతి పండగ వెళ్లిన తర్వాత చేపట్టాలని భావిస్తుంది. ఒకవేళ ఈ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే.. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఇది నిధుల విడుదలకు అడ్డంకిగా మారుతోంది. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# మేడారంలో నూతన గద్దెలపై కొలువుదీరిన పగిడిద్దరాజు గోవిందరాజు

**ములుగు :** ములుగు జిల్లాలోని మేడారంలో నూతన గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువుదీరారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గోవిందరాజును బుధవారం ఉదయం 6 గంటలకు, పగిడిద్దరాజును 9.45 గంటలకు పూజారులు పునఃప్ర తిష్ఠించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా భక్తులను గద్దెల ప్రాంగణంలోకి రానివ్వకు ండా పటిష్టంగా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులు కుటుంబాలతో పాటు హాజరై పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివాసీ సంప్రదా యాలకు అనుగుణంగా : మేడారం పునర్నిర్మాణ పనుల్లో భాగంగా పగిడిద్దరాజు, గోవిందరాజుల పునఃప్రతిష్టాపన జరగింది. ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా ఈ కార్యక్ర మాన్ని చేశారు. రహస్యంగా పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. దీంతో ఇవాళ మేడారంలో భక్తులకు వన దేవతల దర్శనా లు నిలిపివేశారు. దర్శనాలకు వచ్చే భక్తులు ఒకరోజు వాయిదా వేసుకోవాలని ఈవో విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. మేడారంలో నూతన గద్దెలపై కొలువుదీరిన పగిడిద్దరాజు, గోవిందరాజు "ఆదివాసీ జీవన విధానం, సమ్మక్క-సారలమ్మ చరిత్ర. మా అస్థిత్వాలు ఇవన్నీ కూడా శిలలపై చెక్కడం జరిగింది. దీని వల్ల భవిష్యత్తులో



మా అస్థిత్వాన్ని ఎవరు ఆక్రమణ చేయకుండా ఇవన్నీ ఉన్నాయి. ఈ అభివృద్ధి పనులను సీఎం రేవంత్? రెడ్డి గారు ఒక యజ్ఞంలా చేస్తున్నారు. కొంతమందికి ఇవన్నీ నచ్చక మా దేవుళ్లను కించపరిచే విధంగా మాట్లాడుతున్నారు. అది తప్పు. ప్రకృతి ఎంత బలంగా ఉంటుందో మా దేవుళ్ల ఆశీర్వా దాలు అలాంటివి" -సీతక్క, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రివే ుడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరను ఈసారి సరికొత్త రూపుతో వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఉపక్రమించింది. జనవరి 28 నుంచి 31 వరకు జరిగే జాతరకు తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి దాదాపు కోటి మందికి పైగా భక్తులు తరలి వస్తారని అంచనా ఉంది. ఈసారి ఎప్పుడూ కల్పించే తాత్కాలిక సౌకర్యాలతోపాటు శాశ్వత నిర్మాణాలపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించింది. ఎన్నడూ లేనివిధంగా భారీగా రూ.251 కోట్లతో మేడారం అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. వనదేవతల గద్దెల విస్తరణ ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ పనులకే రూ.101 కోట్ల నిధులను ఖర్చు చేస్తోంది. పునర్నిర్మాణంలో ప్రత్యేకతలెన్నో : ఆలయంలో గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా పూర్తిగా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఆకర్షణీయంగా ఉండనుంది. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలను ఏర్పాటు చేస్తున్నారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున భారీ ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది. పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను సమ్మక్క-సారలమ్మ గద్దెలు ఉండే వరుసలోకి మార్చారు. భక్తులంతా ఒక వరుసలో దర్శనానికి వెళ్లేలా సౌకర్యంగా ఉండేలా ఈ ఏర్పాటు చేస్తున్నారు. వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో పనులను చేస్తున్నారు. ఆలయం ప్రధాన స్వాగత తోరణంపై సమ్మక్క వంశీయుల చరిత్ర తెలిపే విధంగా 59 బొమ్మలు చెక్కారు. వన దేవత సమ్మక్కది రాయి బందానీ 5వ గొట్టు వంశం. వీరి ఇంటి దైవమైన ఒక కొమ్ము ఉండే దుప్పి రెండువైపులా అడవి దున్న కొమ్ములు, నెమలి ఈకలను స్వాగత తోరణానికి అగ్రభాగాన చెక్కారు. మిగతా శిలలపై 3, 4, 5, 6, 7, గొట్టుల వంశీయుల చరిత్ర, వారు పూజించిన జంతువులు, జీవనశైలిని స్పష్టంగా తెలిపే చిత్రాలను చెక్కారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో షాకింగ్ ఆధారాలు

**హైదరాబాద్, డిసెంబర్ 24:** ఫోన్ టాపింగ్ కేసులో మరో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఆధారంగా ఒక పెన్ డ్రైవ్ మారడంతో దానిపైనే ఇప్పుడు ప్రత్యేక దర్యాప్తు బృందం ) విచారణ మొత్తం కేంద్రీకృతమైంది. ఫోన్ టాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక డేటా ఈ పెన్ డ్రైవ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించడంతో కేసు మరింత కీలక దశకు చేరుకుంది. ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా పనిచేసిన సమయంలో ఫోన్ టాపింగ్‌కు సంబంధించిన వివరాలను ఈ పెన్ డ్రైవ్‌లో స్టోర్ చేసినట్లు సిట్ ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ పెన్ డ్రైవ్‌లో వందల సంఖ్యలో ఫోన్ నంబర్లు ఉండటంతో పాటు, వాటికి సంబంధించిన పూర్తి ప్రొఫైల్స్ కూడా భద్రపరచినట్టు అధికారులు గుర్తించారు. పెన్ డ్రైవ్‌లో రాజకీయ నేతలు, ప్రముఖ జర్నలిస్టులు, అలాగే హైకోర్టు న్యాయమూర్తులకు సంబంధించిన ఫోన్ నంబర్లు, ప్రొఫైల్స్ ఉన్నట్టు సిట్‌కు స్పష్టమైన ఆధారాలు లభించాయి. ఈ డేటా ఆధారంగానే ఎవరి ఫోన్లు టాపింగ్‌కు గురయ్యాయనే విషయాన్ని



సిట్ గుర్తించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ పెన్ డ్రైవ్‌లో ఉన్న సమాచారాన్ని ప్రభాకర్ రావు ముందుంచి, సిట్ అధికారులు విచారణ చేపడుతున్నారు. టాపింగ్ ఎలా జరిగింది, ఎవరి ఆదేశాల మేరకు ఈ డేటా సేకరించబడిందన్న అంశాలపై లోతైన ప్రశ్నలు వేస్తున్నట్లు సమాచారం. ప్రభాకర్ రావు టీమ్ ఫోన్ టాపింగ్‌కు సంబంధించిన అనేక ఆధారాలను నాశనం చేసినప్పటికీ, ఈ పెన్ డ్రైవ్‌ను మాత్రం సిట్ స్వాధీనం చేసుకోవడం కేసులో కీలక పరిణామంగా మారింది. కేసును నిరూపించేందుకు ఈ పెన్ డ్రైవ్ బలమైన సాక్ష్యంగా ఉపయోగపడుతుందని సిట్ అధికారులు భావిస్తున్నారు. మూడు రోజుల పాటు ప్రభాకర్ రావు విచారించి, అతని నుంచి పూర్తి వివరాలు, స్పష్టమైన వివరణలను సేకరించేందుకు సిట్ సిద్ధమైంది. ఈ పెన్ డ్రైవ్ ఆధారంగా ఫోన్ టాపింగ్ కేసులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# నాచారం పరిసరాల్లో గుప్పుమంటున్న గంజాయి

**హైదరాబాద్:** నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లాపూర్, నాచారం పరిసర ప్రాంతాలలో కొంతకాలంగా గంజాయి గుప్పుమంటోంది. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల బారిన పడి తమ భవిష్యత్‌ను కోల్పోతున్నారు. దీనిని అరికట్టేందుకు పోలీసులు ఎన్ని రకాలుగా చర్యలు చేపట్టినా ఆగడం లేదు. నూతన సంవత్సరం సమీపిస్తున్న వేళ పోలీసుల కళ్లు గప్పి గంజాయిని విక్రయించేందుకు విక్రయదారులు సిద్ధమవుతున్నారు. గుట్టుగా జరిగే గంజాయి విక్రయాలను ఎలా కట్టడి చేయాలనేది పోలీసులకు సవాలుగా మారనుంది బతుకుదెరువు నిమిత్తం బిహార్, రాజస్థాన్, జార?ండ్ రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో యువత హైద్రాబాద్‌కు వలసవచ్చి మల్లాపూర్, గోకుల్‌నగర్, చాణక్యపురి కాలనీ, నాచారం, కార్తికేయ నగర్, బాబానగర్ పరిసర ప్రాంతాలలో ఉంటున్నారు. పలు కంపనీలలో లేబర్‌లుగా, అడ్డా కార్మికులుగా పని చేస్తూ కొందరు అక్రమ గంజా విక్రయాలకు పాల్పడుతున్నారు. తమ



స్వస్థలం నుంచి అక్రమ మార్గంలో వెంట తెచ్చిన గంజాయిని ఇక్కడి యువతకు గుట్టుగా విక్రయించి సొమ్ము చేసుకుంటు న్నారు. గతంలో గంజాయిని విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డ సందర్భాలు అనేకం ఉన్నాయి. గంజాయి సేవించేందుకు ఆకతాయిలు నాచారం, మల్లాపూర్ పరిసర ప్రాంతాల్లోని నిర్మానుష ప్రదేశాలను, చెరువు కట్టలను ఎంపిక చేసుకుంటున్నా రు. గంజాయి సేవించిన తర్వాత సైకోలుగా మారి వికృత చేష్టలతో స్థానికులను బెంబేలెత్తిస్తున్నారు. గంజాయి మత్తులో ఇష్టారీతిన రోడ్లపై వాహనాలను నడిపిస్తూ, ఇదేంటని ప్రశ్నించిన తోటి వాహనదారులపైనే రాళ్లతో దాడులు చేస్తున్నారు. విక్రయిస్తే కఠిన చర్యలుగంజాయిని అక్రమంగా విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. రిపీటెడ్ నేరస్థులపై పీడీ యాక్టుతో పాటు, గాంజా సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తాం. విక్రయదారులతో పాటు, సేవించే వారిని కూడా అరెస్టు చేసి చట్టపరంగా శిక్షిస్తాం. పాత నేరస్థులపై నిఘా పెట్టడంతో పాటు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ వాహనాలను తనిఖీలు చేస్తున్నాం. నూతన సంవత్సరం వేళ తల్లిదండ్రులు తమ పిల్లలను ఇష్టారీతిన వదిలేయకుండా వారి పై నిఘా వేసి ఉంచాలి. పరిసర ప్రాంతాల్లో గంజాయి క్రయ విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

# నేను కాంగ్రెస్‌లోనే ఉన్నా ఎట్టకేలకు ఒప్పుకున్న దానం నాగేందర్



**హైదరాబాద్ :** తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఒప్పుకున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎవరు, ఏ పార్టీలో ఉన్నారో తనకు తెలియదని తెలిపారు. నేను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుందని దానం నాగేందర్ అన్నారు. జీహెచ్ఎంసీలో కాంగ్రెస్, ఎంఐఎం కలిపి మొత్తం 300 డివిజన్లలో గెలుస్తాయని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ అంతా ప్రచారం చేస్తానని.. కాంగ్రెస్ పథకాలను వివరిస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు దిశగా గులాబీ పార్టీ పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు అందరూ తాము బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని చెబుతున్నారు. ఈ క్రమంలో దానం నాగేందర్ మాత్రం తాను కాంగ్రెస్‌లో ఉన్నానని ఒప్పుకున్నారు. హైకమాండ్ నుంచి స్పష్టమైన హామీ రావడంతోనే దానం నాగేందర్ ఈ ప్రకటన చేశారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# సృష్టి' కేసులో అరెస్టై బెయిల్?పై వచ్చారు - చిన్నారులను విక్రయిస్తూ అడ్డంగా బుక్కయ్యారు

**హైదరాబాద్:** చిన్నారుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాను మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వివరాలను మాదాపూర్ డీసీపీ రితిరాజ్ మీడియా సమావేశంలో తెలిపారు. గుజరాత్ నుంచి చిన్నారులను తీసుకొచ్చి హైదరాబాద్, మంచిర్యాలలో విక్రయించారని అన్నారు. దాదాపు 20 మంది ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.



ముఠాలో స ృష్టి ఫెర్టిలిటీ కేసుకు సంబంధించిన నిందితులు ఉన్నట్టు గుర్తించామన్నారు. స ృష్టి కేసులో బెయిల్‌పై వచ్చి చిన్నారులను విక్రయిస్తున్నారని చెప్పారు. ఒక్కో చిన్నారిని రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని డీసీపీ రితురాజ్? తెలిపారు. "ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న పిల్లలను శిశువిహార్‌కు తరలించాం. మియాపూర్‌లో నిందితులను అదుపులోకి తీసుకున్నాం. అహ్మదాబాద్‌లోని పేద కుటుంబాల, బలహీనవర్గాలకు చెందిన పిల్లల అక్రమ రవాణా చేస్తున్నారు. పిల్లలను లక్ష్మీ, హర్ష రాయ్ అనే వ్యక్తులు అక్రమ రవాణా చేశారు. గోపాలపురం పరిధిలో 13 కేసులు నమోదయ్యాయి. ఐవీఎఫ్ కేంద్రాలతో ఈ నిందితులకు సంబంధాలున్నాయి. సరోగసీ కోసం మహిళలను నిందితులు సమకూర్చేవారు. 11 మంది నిందితులను రిమాండ్‌కు తరలిస్తాం" -రితిరాజ్?, మాదాపూర్ డీసీపీ

# సీపీ సజ్జనార్ వార్నింగ్ హద్దుమీరితే సంతోషం చెడుద్ది మరి

**హైదరాబాద్ :** న్యూ ఇయర్ వేడుకల్లో నిర్వాహకులు, వినియోగదారులు హద్దుమీరినా, రూల్స్ అతిక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటామని హైదరా బాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. కొత్త సంవత్సరంలో సంతోషం లేకుండా పోతుందని అన్నారు. ఈవెంట్ నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధి, విధానాలపై క్షేత్రస్థాయి సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈవెంట్స్ జరిగే ప్రాంతాల్లో



సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. పార్టీల నిర్వహణకు పోలీస్ అనుమతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో సౌండ్స్ సిస్టం, లౌడ్ స్పీకర్ రాత్రి 10:00కి క్లోజ్ చేయాలన్నారు. 15 షీటీమ్స్ బృందాలను మఫ్టీలో రంగంలోకి దింపుతామన్నారు. రాత్రి 9 గంటల నుంచే..డిసెంబరు-31 అర్ధరాత్రి ఎక్కడిక్కడ డ్రంకెన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు సీపీ తెలిపారు. అన్ని ప్రాంతాల్లోనూ చెక్‌పోస్టులు పెడుతున్నామన్నారు. రాత్రి 9 గంటల నుంచే డ్రంకెన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ ఉంటుందన్నారు.

# రీజనల్ రింగ్ రోడ్ నిర్వాసిత రైతుల సమస్యలపై ఎమ్మెల్సీ కవిత పోరాటం




**భువనగిరి డిసెంబర్ 24:** రీజనల్ రింగ్ రోడ్ (ట్రిపుల్ ఆర్) ప్రాజెక్టు నిర్వాసిత రైతుల సమస్యలపై ఎమ్మెల్సీ కవిత గట్టిగా స్పందించారు. రాయిగిరి, తిమ్మాపురం, బస్వాపూర్ వంటి ప్రాంతాల రైతులతో కలిసి మాట్లాడిన కవిత, ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో చిన్న రిజర్వాయర్‌ను పెద్దదిగా మార్చి రైతుల భూములు లాగేసుకున్నారని ఆరోపించారు. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం (భువనగిరి)లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మేరకు స్పందించారు. పరిహారం రాలేదని ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. 'ట్రిపుల్ ఆర్ రైతులకు అండగా ఉండి, సమస్యలు పరిష్కరించేందుకు అందరం కలిసి ఉద్యమిద్దాం' అని కవిత పిలుపునిచ్చారు. జనవరి 4న 8 జిల్లాల నిర్వాసిత రైతులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ఆసుపత్రుల్లో వైద్య సేవలు, చికిత్స నాణ్యతపై కూడా అధికారులను ప్రశ్నించి కవిత సమాచారం సేకరించారు.

గురువారం, డిసెంబర్ 25, 2025

TGTEL/25/A3750 ... నిజమే ...

నిజాయితి

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక




# ఉన్నట్లుండి అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకున్న జగన్



**పులివెందుల** :వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. వైఎస్ జగన్ జ్వరంతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో వైద్యుల సూచన మేరకు బుధవారం రోజు పాల్గొనాల్సిన అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఎక్స్ వేదికగా వైసీపీ ట్వీట్ చేసింది. మరోవైపు వైఎస్ జగన్ ప్రస్తుతం పులివెందుల పర్యటనలో ఉన్నారు.ఈ పర్యటనలో భాగంగా షెడ్యూల్ ప్రకారం.. వైఎస్ జగన్ బుధవారం రోజున ఇడుపులపాయలో జరిగే ప్రార్థనల్లో పాల్గొనాల్సి ఉంది. అలాగే బుధవారం మధ్యాహ్నం నుంచి పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించాల్సి ఉంది. అయితే వైఎస్ జగన్ జ్వరం బారిన పడటంతో ఈ కార్యక్రమాలను అన్నింటినీ రద్దు చేసుకున్నారు. మరోవైపు క్రిస్మస్ సందర్భంగా గురువారం రోజున పులివెందుల చర్చిలో జరిగే ప్రార్థనలకు వైఎస్ జగన్ హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి.పులివెందుల పర్యటనలో భాగంగా మంగళవారం రోజున వైఎస్ జగన్.. కార్యకర్తలు, ప్రజలతో సమావేశమయ్యారు. మంగళవారం సాయంత్రానికి పులివెందులకు చేరుకున్న వైఎస్ జగన్‌కు.. వైసీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పేరుపేరునా అందరినీ పలకరించిన వైఎస్ జగన్.. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

# 20 నెలల్లో ఎయిర్‌పోర్టు రేంజులో



**విశాఖపట్నం** : కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏపీలో పలు రైల్వే స్టేషన్ల రూపురేఖలు మారుతున్నాయి. అమ ృత్ భారత స్టేషన్లల్ల పథకం కింద ఏపీలో సుమారుగా 70కి పైగా రైల్వేస్టేషన్లల్లో అభివ ృద్ధి పనులు చేపడుతున్నారు. అలాగే ప్రయాణికుల రద్దీ, రైళ్ల రాకపోకలు వంటి అవసరాలను ద ృష్టిలో పెట్టుకుని మరికొన్ని రైల్వే స్టేషన్లను కూడా అభివ ృద్ధి చేస్తున్నారు. ఈ క్రమంలోనే విశాఖ రైల్వే స్టేషన్ కొత్త రూపు సంతరించుకోనుంది. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఎయిర్ పోర్టు రేంజులో అభివ ృద్ధి చేసేందుకు రైల్వే శాఖ.. పునరాభివ ృద్ధి ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రాజెక్టు పనులపై విశాఖ ఎంపీ భరత్ బుధవారం సమీక్ష నిర్వహించారు. వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులతో కలిసి విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివ ృద్ధి పనులను ఎంపీ భరత్ పరిశీలించారు.అనంతరం మీడియాతో మాట్లాడిన భరత్.. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పలు వివరాలను వెల్లడించారు. రూ. 500 కోట్ల వ్యయంతో విశాఖ రైల్వే స్టేషన్ పునరాభివ ృద్ధి ప్రాజెక్టు పనులను చేపట్టినట్లు ఎంపీ భరత్ వెల్లడించారు. వివిధ కారణాలతో ఈ పనులు కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని.. ప్రస్తుతం విశాఖ రైల్వే స్టేషన్ పునరాభివ ృద్ధి ప్రాజెక్టు పనులలో వేగం పెరిగిందన్నారు. 20 నెలల్లో ఈ పనులు పూర్తి చేస్తామని ఎంపీ భరత్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పునరాభివ ృద్ధి ప్రాజెక్టు పనులలో భాగంగా విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫామ్‌ల ఆధునికీకరణ, పశ్చి రైల్వే గేట్ పనులు చేపడుతున్నట్లు ఎంపీ భరత్ వివరించారు.

# తిరుమలలో వారికి అరగంటలో దర్శనం పూర్తి



**తిరుమల** : శ్రీవారిని దర్శించుకోవడానికి నిత్యం వేలాదిమంది భక్తులు తరలివస్తుం టారు. టీటీడీ ఆన్‌లైన్ కోటా, శ్రీవాణి ట్రస్ట్, , శ్రీవారి ఆర్జిత సేవలు ఇలా టికెట్లను అందుబాటులో ఉంచుతుంది. అంతేకాదు వ ృద్ధులు, దివ్యాంగుల కోసం కూడా ప్రతి నెలా కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తుంది. అయితే సోషల్ మీడియా వేదికగా ఓ ప్రచారం జరుగుతోంది.. అందులో టీటీడీ కొత్తగా వ ృద్ధుల కోసం ఉచిత దర్శన పథకం ప్రారంభించినట్లుగా ఓ మెసేజ్ వైరల్ అవుతోంది. ఇది నిజం అనుకుని చాలామంది నమ్మేశారు.. అయితే ఈ అంశంపై టీటీడీ క్లారిటీ ఇచ్చింది.‘ వ ృద్ధుల కోసం ఉచిత తిరుపతి బాలాజీ దర్శన పథకం ప్రారంభం. తిరుపతిలో వ ృద్ధుల కోసం ఉచితంగా బాలాజీ దర్శన పథకం ప్రారంభమయింది. సీఎం చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రారంభించారు. 65 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వ ృద్ధులు ఈ పథకానికి అర్హులు. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు వ ృద్ధులకు ఉచితంగా స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తారు. ఎస్ 1 కౌంటర్ వద్ద ఫొటో గుర్తింపు కార్డు, వయస్సు ధ ృవీకరణ పత్రం చూపితే దర్శనానికి అనుమతిస్తారు’ అని ట్వీట్‌లు చేశారు.

# కొత్తగా మరో 70 అన్న క్యాంటీన్లు



**అమరావతి** : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ ప్రజలకు శుభవార్త అందించింది. నియోజకవర్గ, మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు కాబోతున్నాయి. మొత్తం 70 అన్న క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నారు. జనవరి 10లోగా నిర్మాణ పనులు పూర్తి చేసి.. జనవరి 13 నుంచి 15 మధ్య ఈ క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు విజయవంతం అయ్యాయి.. ప్రజల నుంచి ఆదరణ వస్తోంది. అందుకే గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లను విస్తరించాలని ప్రభుత్వం నిర?యం తీసుకుంది.గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర?యం తీసుకుంది. కొత్తగా మొత్తం 70 క్యాంటీన్లను మంజూరు చేసింది. ప్రస్తుతం పట్టణాల్లో 205 అన్న క్యాంటీన్లు నడుస్తున్నాయి.. వీటిలో రోజుకు మూడు పూటలా కలిపి 2 లక్షల మందికి పైగా ప్రజలు తక్కువ ధరకే భోజనం చేస్తున్నారు. ఉదయం, రాత్రి టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. ఒక్కో పూటకు కేవలం రూ.5కే రుచికరమైన ఫుడ్ అందిస్తున్నారు. ఈ పథకం గ్రామీణ ప్రజలకు కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

# సుపరిపాలన యాత్రకు విశేష స్పందన: పీవీఎన్ మాధవ్



**విజయవాడ, డిసెంబర్ 24:** అటల్ మోదీ సుపరిపాలన యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో వాజ్‌పేయి విగ్రహాలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నేటి తరానికి వాజ్‌పేయి విలువలు ఆదర్శమని అన్నారు. వాజ్‌పేయి గొప్పతనం తెలుసుకుని అందరూ ఆశ్చర్యవ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సుపరిపాలన యాత్ర గురించి సీఎం చంద్రబాబుకు చెప్పిన వెంటనే ఆనందం వెలిబుచ్చారని తెలిపారు. ఈ యాత్రకు కూటమిపరంగా , ప్రభుత్వపరంగా సహకారం అందించారని చెప్పారు.ఈ యత్రలు, సభల్లో కూటమి పార్టీల నేతలను భాగస్వామ్యం చేశారన్నారు. అటల్, చంద్రబాబులకు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. సైబరాబాద్, శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లకు నాడు వాజ్‌పేయి సహకారం అందించారని గుర్తుచేశారు. సుపరిపాలన యాత్రలో బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారన్నారు. వాజ్‌పేయి ఈ దేశానికి చేసిన సేవకు, త్యాగాలను గురించి అందరూ ముక్త కంఠంతో కీర్తిస్తున్నారని తెలిపారు. ఈనెల 25న వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా అమరావతిలో స్మృతి వనం, విగ్రహాన్ని ప్రారంభిస్తున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొంటారని తెలిపారు.ధర్మవరం నుంచి అమరావతి వరకు తమ యాత్రకు ప్రజలు నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, గ్రామాలకు రోడ్లు, ఐటీ, టెలికం, పొలిటి కల్ కనెక్టివిటీలకు ఆద్యులు వాజ్‌పేయి అని కొనియాడారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా అనే తేడా లేకుండా ప్రజలు నుంచి వస్తున్న స్పందన అపూర్వమన్నారు. నేటి యువతరం, భవిష్యత్తుతరాలు వాజ్‌పేయి గొప్పతనం తెలుసుకోవాలని సూచించారు. తాము ఏర్పాటు చేసిన విగ్రహాలు, యాత్ర ద్వారా వాజ్‌పేయి నుంచి చాలా మంది స్ఫూర్తి పొందుతున్నా రన్నారు.వాజ్‌పేయి ఆశయాలకు అనుగుణంగా మోదీ అద్భుతమైన పాలన సాగిస్తూ దేశాన్ని ముందుకు తీసుకువెళుతున్నారని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్, వికసిత్ ఏపీ కోసం అందరం కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. సుపరిపా లన యాత్రలకు, సభలకు సహకారం అందించిన వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈనెల 25న జరిగే వాజ్ పేయి భారీ విగ్రహం ఆవిష్కరణ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ పిలుపునిచ్చారు.

# రుషికొండపై కేబినెట్ సబ్ కమిటీ మరోసారి భేటీ



**అమరావతి, డిసెంబర్ 24:** విశాఖ రుషికొండ ప్యాలస్‌పై మంత్రి వర్గ ఉపసంఘం సమావేశం జరిగిందని... హాస్పిటాలిటీ ఇండస్ట్రీకి ప్యాలెస్‌ను ఇచ్చే అంశంపై పరిశీలించినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ ) తెలిపారు. కానీ కొంతమంది హోటల్ కోసం అదనపు స్థలం కావాలని అడిగారని చెప్పారు. రుషికొండ కింద ఉన్న 9 ఎకరాలు స్థలంలో ఏడు ఎకరాలు సీఆర్‌జెడ్ నిబంధనలోకి వస్తాయని.. ఆ 7 ఎకరాల్లో ఎలాంటి నిర్మాణం చేయకూడదన్నారు. తమకు ఇదో సవాల్‌గా మారిందన్నారు. ఎల్లుండి మరోసారి సమావేశం అవనున్నట్లు చెప్పారు.రుషికొండ నిర్మాణాలపై మళ్ళీ నిర్మాణాలు చేసే అవకాశం ఉందని.. పైన రెండు ఫ్లోర్లు వేసుకునే అవకాశం ఉందన్నారు. రుషికొండ చివరి రెండు బ్లాక్‌లు ప్రజలకు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు, టూరిస్ట్ అవసరాల కోసం ఉంచుతామని చెప్పారు. తాజ్ గ్రూప్, లీలా హోటల్ గ్రూప్, అట్మాస్ఫియర్ కోర్ వంటి గ్రూప్ హోటల్స్ ముందుకు వచ్చాయని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.ఇదంతా వారి వల్లే: మంత్రి కందులరుషికొండపై ఇప్పుడు తలబద్దలు కొట్టుకోడానికి ఆనాటి ప్రభుత్వమే కారణమని ఏపీ టూరిజం శాఖా మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు. ఆదాయం వచ్చే భవనాలు కూల్చి ప్యాలెస్ కట్టారని మండిపడ్డారు. మరోసారి రుషికొండ వినియోగంపై చర్చ జరుగుతుందన్నారు. అనేక ప్రపోజల్స్ వస్తున్నాయని.. వైబుల్ ప్రాజెక్ట్ ఏంటి అనే అంశంపై దృష్టి పెట్టామని తెలిపారు. సముద్రం ఆటు పోట్ల వల్ల రుషికొండ కింద 9 ఎకరాల్లో 2 ఎకరాలు మాత్రమే అందుబాటులోకి వస్తాయన్నారు. ఏడు ఎకరాలు సీఆర్‌జెడ్ నిబంధనల పరిధిలోకి ఉంటా యని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.కాగా.. రుషికొండ ప్యాలెస్‌ను ఎలా వినియోగించాలన్న అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ 3వ భేటీ (బుధవారం) జరిగింది. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ, ఏపీ టీపీ సీఈఓ ఆమ్రపాలి కాట, పర్యాటక శాఖ అధికారులు పాల్గొనగా... మంత్రి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి వర్చువల్‌గా పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ అవినీతి ఒక్కొక్కటిగా బయటకు వస్తుంది



**అమరావతి, డిసెంబర్ 24:** జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)లో అనేక అవినీతి కార్యక్రమాలు జరిగాయని.. అన్ని ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. బుధవారం అమరావతిలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. స్వామి వారి లడ్డు ప్రసాదం తయారీలో వినియోగించిన కల్తీ నెయ్యి వ్యవహారంలో సైతం సంచలన విషయాలు బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులనే కాకుండా.. దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులను కూడా అనేక ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. అంతేకాదు.. తిరుమల వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పించే విషయంలో కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందంటూ మండిపడ్డారు.టీటీడీ చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి ఉన్న సమయంలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. నేడు ఆయన నేడు బయటకు వచ్చి ఎటువంటి అక్రమాలు జరగలేదని చెప్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వ పాలనలో అన్నప్రసాదంలో కానీ, వసతి విషయంలో కానీ అక్రమాలన్నీటిని బయటకు తీస్తున్నామని మంత్రి జనార్ధన్ రెడ్డి వివరించారు. డిసెంబర్ 30వ తేదీన వైకుంఠ ఏకాదశి అని.. ఆ రోజు 90 శాతానికి పైగా సామన్య భక్తులకు సౌకర్యాలు కల్పించాలనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు.అలాగే, లడ్డు ప్రసాదం తయారీకి వినియోగిస్తున్న నెయ్యిని కూడా అన్ని పరీక్షలు నిర్వహించి తరువాతే లడ్డు తయారీకి ఉపయోగిసున్నామని వివరించారు. ఇవన్నీ చూసి ఓర్వలేక.. పత్రికల ద్వారా తిరుమలపై అసత్య ప్రచారాలు చేయిస్తున్నారంటూ వైసీపీ నాయకులపై మండిపడ్డారు. దేవుడి మీద నమ్మకం లేని భూమన కరుణాకర్ రెడ్డికి టీటీడీ పదవిని కట్టబెట్టడమే గత ప్రభుత్వ తప్పు అని ప్రజలందరూ అనుకుంటున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని.. ఇది చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. ఇటీవల విశాఖపట్నం వేదికగా నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రానికి కోట్లాది రూపాయల పెట్టుబడులుగా వచ్చాయ న్నారు. దీంతో దేశం మొత్తం ఆంధ్రరాష్ట్ర పురోగతి చూస్తుందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

# అనుమానం ఎంత పని చేసింది స్క్రూ డ్రైవర్‌తో భార్యను




**అనకాపల్లి, డిసెంబర్ 24:** అనుమానం పెనుభూతం అంటారు. భార్యా/భర్త మనసులో ఒక్కసారి అనుమానం అనే బీజం పడితే.. అప్పటి వరకు సజావుగా సాగిన కాపురాలు కుప్పకూలిపోతాయి. అనుమానంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతూనే ఉంటాయి. చిన్న గొడవ అయితే పర్వాలేదు.. కానీ అది చిలికి చిలికి గాలి వానగా మారితే మాత్రం పెను ఉపద్రవాలకు దారి తీసే అవకాశం ఉంటుంది. అనుమానం అనే రోగంతో కట్టుకున్న భార్యను నానా హింసలకు గురిచేస్తున్న వారు ఎందరో. మరికొందరు అయితే విచక్షణమరిచి తమ అర్ధాంగిని కడతేర్చిన ఘటనలు కూడా అనేకం ఉన్నాయి. ఇప్పుడు తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకపల్లి జిల్లాలో కూడా ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. కడదాగా తోడుండాల్సిన భర్తే.. భార్యను అతి కిరాతంగా హత్య చేశాడు. వివరాల్లోకి వెళితే..జిల్లాలోని ఎలమంచిలి పట్టణంలో అనుమానంతో భార్యను భర్త దారుణంగా హత్య చేశాడు. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన దంపతులు బతుకుతెరువు కోసం ఎలమంచికి వచ్చారు. ఆ దంపతులు పాత ఇనుము దుకాణాన్ని లీజుకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే భార్య తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండాన్ని గమనించిన భర్త ఆమెను మందలించాడు. ఈ విషయంపై తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరిగినట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో ఫోన్‌లో మాట్లాడాటాన్ని భార్య కొనసాగించడంతో ఆగ్రహంతో ఊగిపో యిన భర్త.. ఆమెను అతి కిరాతకంగా స్క్రూ డ్రైవర్‌తో పొడిచి హత్య చేశాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన స్థానకంగా సంచలనం సృష్టిస్తోంది.

# ఏపీలో ఈ నాలుగు నగరాలకు మహర్దశ



**అమరావతి** : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘన వ్యర్థాల సమస్యను పరిష్కరించడానికి కీలక నిర?యం తీసుకుంది. రాష్ట్రంలో కొత్తగా చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసేలా నాలుగు ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును డిస్కంలకు సరఫరా చేయడానికి ఒప్పందం చేసుకున్నారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రి నారాయణ, ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంపై డిస్కంల అధికారులు, ప్లాంట్ల నిర్వాహకులు సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం కొత్తగా ఏర్పాటుచేస్తున్న నాలుగు ఘన వ్యర్థాల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల నుంచి వచ్చే కరెంటును డిస్కంలు కొనుగోలు చేస్తాయి. దీనివల్ల రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణతో పాటు విద్యుత్ ఉత్పత్తి కూడా పెరుగుతుంది.ప్రస్తుతం విశాఖపట్నం, గుంటూరులలో ఇప్పటికే ఇలాంటి ప్లాంట్లు పనిచేస్తున్నాయి. ఇప్పుడు నెల్లూరు, కాకినాడ, కడప, కర్నూలు జిల్లాల్లో కొత్త ప్లాంట్లు రానున్నాయి. ఈ ప్లాంట్లు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మిస్తున్నారు. ఈ కొత్త ప్లాంట్లు పూర్తయితే, రాష్ట్రంలో రోజుకు 7వేల టన్నుల ఘన వ్యర్థాలను విద్యుత్తుగా మార్చవచ్చు. ఇది పర్యావరణానికి మేలు చేయడంతో పాటు, విద్యుత్ అవసరాలను తీర్చడంలో కూడా సహాయపడుతుంది. వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయడం అనేది ఒక ఆధునిక పద్ధతి. దీనివల్ల చెత్తను పారవేయడం సులభం అవుతుంది. అలాగే, కరెంటు కూడా ఉత్పత్తి అవుతుంది. ఈ ప్రక్రియలో, వ్యర్థాలను కాల్చి లేదా ఇతర పద్ధతుల ద్వారా వేడి చేసి, ఆ వేడితో టర్బైన్లను తిప్పి విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. ‘వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు, రాష్ట్రానికి అదనపు ఆదాయాన్ని కూడా సమకూర్చవచ్చు’ అన్నారు మంత్రి నారాయణ.‘ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యేలా చూస్తాం.. డిస్కంలు, ప్లాంట్ల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలి’ అన్నారు రాష్ట్ర పురపాలక, పట్టణాభివ ృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్.రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు కానున్న నాలుగు కొత్త ప్లాంట్లకు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తుందని మంత్రి నారాయణ తెలిపారు. ప్రైవేట్ సంస్థలు ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు రూ.350 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును డిస్కంలకు సరఫరా చేయడానికి ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పట్టణ, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల నుంచి వచ్చే 7,500 టన్నుల వ్యర్థాలలో 7,000 టన్నులు ఈ ప్లాంట్లకు వెళ్తాయన్నారు. మిగిలిన 500 టన్నుల వ్యర్థాల నిర్వహణకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామన్నారు. ఈ ప్లాంట్ల నిర్మాణం వచ్చే రెండేళ్లలో పూర్తవుతుందని.. మార్కెట్ వ్యర్థాల నిర్వహణకు ఏడు ప్లాంట్లు, విశాఖ, విజయవాడ, తిరుపతిలో మూడు ఈ–వేస్ట్ ప్లాంట్లు, మరో మూడుచోట్ల చికెన్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటుకు టెండర్లు పిలుస్తున్నామని మంత్రి నారాయణ చెప్పారు.

# దిగొచ్చిన యూనస్ సర్కార్ దీపూదాస్ హంతకులపై చర్యలకు హామీ



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడు దీపు చంద్ర దాస్ పై మూకదాడి చేసి పాశవికంగా హత్య చేసిన ఘటనను ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం ఖండించింది. ఈ పాశవిక హత్యకు మహమ్మద్ యూనస్ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని, ఇందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేస్తుందని మీ ఇచ్చింది. దీపూదాస్ కుటుంబ సభ్యులను విద్యాశాఖ సలహాదారు సీఆర్ అబ్రార్ కలుసుకుని ప్రభుత్వం తరఫున సంతాపం తెలియజేశారు. బంగ్లాదేశ్ సమాజంలో హింసకు తావులేని, దీపూదాస్ హత్యా ఘటన తమను దిగ్భ్రాంతికి గురి చేసిందని మీడియాతో మాట్లాడుతూ అబ్రార్ తెలిపారు. ఆరోపణలు, వదంతులు, భిన్నమైన విశ్వాసాలు హింసకు కారణం కారాదని అన్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే హక్కు ఎవరికీ లేదని చెప్పారు. చట్టాన్ని పరిరక్షించేందుకు తాత్కాలిక ప్రభుత్వం కట్టుబడి ఉందని, నేరాలన్నింటి పైనా సమగ్ర దర్యాప్తు జరిపించి న్యాయం జరిపిస్తామని హామీ ఇచ్చారు. దైవదూషణకు పాల్పడ్డాడనే ఆరోపణతో దీపూ చంద్ర దాస్‌పై కొందరు ఛాందసవాదులు గత వారంలో మూకదాడి చేసి, చెట్టుకు ఉరివేసి చంపారు. అనంతరం మృతదేహాన్ని రోడ్డుపై విసిరేసి పెట్రోలుతో తగులబెట్టారు. ఈ అమానుష ఘటనపై అటు బంగ్లాలోనూ, ఇటు భారత్‌లోనూ నిరసనలు వెల్లువెత్తాయి. ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, హైదరాబాద్, మధ్యప్రదేశ్, అగర్తలా సహా పలు ప్రాంతాల్లో హిందూ సంస్థలు నిరసన ప్రదర్శనలు నిర్వహి ంచాయి. ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఈ దాడిని తీవ్రంగా ఖండించాయి. బంగ్లాలో షేక్ హసీనా ప్రభుత్వం గత ఏడాది కుప్పకూలడానికి దారితీసిన విద్యార్థి ఉద్యమానికి నాయకుడైన షరీఫ్ ఒస్మాన్ బిన్ హాదీపై డిసెంబర్ 12 కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన హాదీ సింగపూర్‌లో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. దీంతో బంగ్లాదేశ్ అల్లర్లతో అట్టుడికింది. ఈ క్రమంలోనే హిందూ యువకుడు దీపూదాస్ పాశవిక హత్య మరింత ఉద్రిక్తతలకు దారితీసింది.

# బంగ్లాదేశ్‌లో చల్లారని హింస హిందూ ఇళ్లను తగలబెట్టిన దుండగులు




**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్‌లో హిందువులపై వేధింపులు ఆగకుండా కొనసాగుతున్నాయి. బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్ చిట్టగాంగ్‌లో అనేక హిందూ ఇళ్లను తగులబెట్టడాన్ని చూపించే వీడియోను విడుదల చేశారు. మంగళవారం (డిసెంబర్ 23) జరిగిన ఈ ఘటనలో ఆస్తి నష్టం తోపాటు కుటుంబంలోని పెంపుడు జంతువులు మరణించాయి. ఇంట్లోని కుటుంబ సభ్యులు రెప్పపాటులో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో బాధితులను జయంతి సంఘ, బాబు శుకుశీల్‌గా గుర్తించారు. సంఘటన జరిగిన సమయంలో కుటుంబం వారి ఇంటి లోపల ఉంది. అన్ని తలుపులు మూసి ఉండటంతో కుటుంబం కంచెను చీల్చుకుని మంటల నుండి తప్పించుకోవలసి వచ్చిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. గుర్తు తెలియని వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కానీ ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదు. అగ్నిప్రమాదంలో ఏడేళ్ల బాలిక సజీవ దహనం ఇదిలావుంటే, డిసెంబర్ 19వ తేదీ రాత్రి, కొంతమంది దుండగులు లక్ష్మీపూర్ సదర్‌లోని ఒక ఇంటికి బయటి నుండి తాళం వేసి, దానిపై పెట్రోల్ పోసి, నిప్పంటించారు. ఈ మంటల్లో 7 ఏళ్ల బాలిక సజీవ దహనం కావడంతో మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా కాలిపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ సంఘటన తెల్లవారుజామున 1 గంటల ప్రాంతంలో జరిగింది. 7 ఏళ్ల బాలిక అక్కడికక్కడే మరణించింది. దీపును హత్య చేసి సజీవ దహనండిసెంబర్ 18న, ఢాకా సమీపంలోని భలుకాలో హిందూ యువకుడు దీపు చంద్రను కొట్టి చంపారు. దాడి చేసిన తర్వాత అతన్ని చెట్టు వేలాదీసి సజీవ దహనం చేశారు. దీపు ఒక వస్త్ర కర్మాగారంలో పనిచేసేవాడు. దీపు ఫేస్‌బుక్‌లో మతపరమైన భావాలను దెబ్బతీసే వ్యాఖ్యలను పోస్ట్ చేశాడని ఆరోపించారు. కానీ దర్యాప్తులో అలాంటి వ్యాఖ్యలకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఫ్యాక్టరీలో పని విషయంలో జరిగిన వివాదం ఫలితంగా ఈ హత్య జరిగింది.

# ఎన్నికల విఘాతానికే హాదీ హత్య యూనస్ సర్కార్‌పై సంచలన ఆరోపణ



**ఢాకా:** బంగ్లాదేశ్ విద్యార్థి నేత షరీఫ్ ఒస్మాన్ హాదీ ఇటీవల ఢాకాలో జరిగిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడి సింగపూర్‌లో చికిత్స పొందుతూ కన్నుమూయడం దేశ రాజకీయాలను కుదిపేస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పార్లమెంటు ఎన్నికలు జరగాల్సి ఉండటం, ఆయన ఎన్నికల ప్రచారంలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకోవడం ఎన్నికల వేడిని మరింత పెంచింది. హాదీ హత్యా ఘటనపై ఆయన సోదరుడు షరీఫ్ ఒమర్ హాదీ బుధవారంనాడు తొలిసారిగా స్పందించారు. బంగ్లా తాత్కాలిక యూనస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఫిబ్రవరిలో జరగాల్సిన ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించేందుకే యూనస్ ప్రభుత్వంలోని ఒక వర్గం తన సోదరుడి హత్యకు కుట్ర చేసిందని ఆరోపించారు. ఇందుకు బాధ్యత వహించాల్సింది యూనస్ సర్కారేనని అన్నారు. మాజీ ప్రధాని షేక్ హసీనాను గత ఏడాది గద్దె దించడానికి కారణానికి విద్యార్థి ఉద్యమం నుంచి ఏర్పడిన సంస్కృతిక సంస్థ ఇంక్విలాబ్ మాంచోకు షరీఫ్ ఒస్మాన్ హాదీ ప్రతినిధిగా ఉన్నారు. డిసెంబర్ 12న ఎన్నికల ప్రచారంలో ఉండగా అతనిపై ఢాకాలో కాల్పులు జరిగాయి. తీవ్రంగా గాయపడిన హాదీని సింగపూర్ తరలించగా చికిత్స పొందుతూ డిసెంబర్ 18న కన్నుమూశారు. హాదీ హత్యతో బంగ్లావ్యాప్తంగా అల్లర్లు చెలరాగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, వార్తాసంస్థలు, సాంస్కృతిక సంస్థలపై పెద్దఎత్తున దాడులు జరిగాయి. మీరూ బంగ్లా వదలి పారిపోవాల్సి వస్తుందిహాదీ హత్యపై ఢాకాలో బుధవారంనాడు జరిగిన నిరసన ప్రదర్శనలో షరీప్ ఒమర్ మాట్లాడుతూ, యూనస్ ప్రభుత్వమే హాదీని చంపిందని, ఇప్పుడు దీన్ని ఒక అంశంగా మలుచుకుని ఎన్నికల ప్రక్రియను పట్టాలమీద నుంచి తప్పించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల వాతావరణానికి ఎలాంటి విఘాతం కలుగకుండా హాదీ హత్యపై శీఘ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. 'ప్రభుత్వం నుంచి ఈ దిశగా ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. హాదీ హత్యకు తగిన న్యాయం జరగకపోతే మీరు కూడా ఒక రోజు బంగ్లాదేశ్ విడిచి పారిపోవాల్సి వస్తుంది' అని యూనస్‌ను షరీఫ్ ఒమర్ హెచ్చరించారు. గత ఏడాది పెద్దఎత్తున విద్యార్థి ఉద్యమం కుదిపేయడంతో ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి పారిపోయిన విషయం విదితమే.

# ఢిల్లీలో మూడు రోజులు ఉంటే అలర్జీలు వచ్చాయి




దేశంలో అత్యంత కాలుష్య నగరాల్లో దేశరాజధాని ఢిల్లీ మొదటి స్థానంలో ఉంటుంది. అక్కడ ఏటా శీతాకాలం సమయంలో కాలుష్య స్థాయిలు ప్రమాదకరస్థాయిలో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మూడు రోజులు ఢిల్లీలో ఉంటే.. కాలుష్యం కారణంగా అలర్జీలు వచ్చాయని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో గడ్కరీ పాల్గొని మాట్లాడారు. ఢిల్లీలో తీవ్ర కాలుష్యానికి 40 శాతం రవాణా రంగమే కారణమని అంగీకరించారు. 'నేను రవాణా శాఖ మంత్రిని. 40 శాతం కాలుష్యానికి రవాణా రంగమే కారణం' అని తెలిపారు. 'ఇది ఎలాంటి జాతీయవాదం..? శిలాజ ఇంధనాలు పరిమితంగా ఉన్నాయి. కాలుష్యం పెరుగుతోంది. శిలాజ ఇంధన వినియోగాన్ని మనం తగ్గించలేమా..? సున్నా కాలుష్యానికి దారితీసే ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ శక్తితో నడిచే వాహనాలను మనం ఎందుకు ప్రోత్సహించలేము..?' అని నితిన్ గడ్కరీ ప్రశ్నించారు. శిలాజ ఇంధనాల్ని దిగుమతి చేసుకోవడానికి ఏటా రూ.22 లక్షల కోట్ల ఖర్చు అవుతోందని.. ఇది ఆర్థిక భారమని చెప్పారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్, హైడ్రోజన్ వాహనాల వైపు మళ్లాలని సూచించారు. ఢిల్లీలో నేను ఉండలేను. కాగా, ఢిల్లీ కాలుష్యంపై గడ్కరీ గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేసిన విషయం తెలిసిందే. తాను రాజధాని నగరంలో రెండు లేదా మూడు రోజులకంటే ఎక్కువ ఉండలేనని అన్నారు. ఢిల్లీకి వస్తే.. ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అనే ఉంటుందని వ్యాఖ్యానించారు. 'నేను ఢిల్లీలో రెండు లేదా మూడు రోజులు మాత్రమే ఉండగలను. అంతకుమించి ఉండటం నావల్ల కాదు. ఢిల్లీలో అడుగుపెట్టగానే ఎప్పుడు వెళ్లిపోదామా అనే ఉంటుంది. అందుకే నేను వచ్చేటప్పుడే రిటర్న్ టికెట్స్ కూడా బుక్ చేసుకుంటాను. ప్రజలు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఢిల్లీలో కాలుష్యం కారణంగా సాధారణ ప్రజల ఆయుర్దాయం తగ్గింది. వాహనాలకు వినియోగించే శిలాజ ఇంధనాల వల్ల కలిగే కాలుష్యాన్ని తగ్గించడం ప్రజలందరి ప్రధాన బాధ్యత' అని అన్నారు.

# ఎల్వీఎం3-ఎం6 మిషన్ విజయవంతం కక్ష్యలోకి బ్లూబర్డ్ బ్లాక్-2 శాటిలైట్



**శ్రీహరికోట:** కమర్షియల్ మిషన్‌ను ఇస్రో విజయవంతంగా నిర్వహించింది. ఇవాళ ఉదయం అమెరికాకు చెందిన కమ్యూనికేషన్ శాటిలైట్ బ్లూబర్డ్ బ్లాక్-2(%దీశ్రీబవదీఱతీ దీశ్రీశీఛిస%-2)ను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఎల్‌వీఎం3-ఎం6 భారీ రాకెట్ ద్వారా ఆ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు. 24 గంటల కౌంట్‌డౌన్ ముగియగానే ఇవాళ ఉదయం ఉదయం 8.55 నిమిషాలకు ఎల్వీఎం3 రాకెట్ దూసుకెళ్లింది. ఆ రాకెట్ సుమారు 43.5 మీటర్ల పొడుగు ఉన్నది. దానికి ఎస్200 సాలిడ్ బూస్టర్లు ఉన్నాయి. శ్రీహరికోటలోని రెండోవ లాంచ్ ప్యాడ్ నుంచి దీన్ని ప్రయోగించారు. అంతరిక్ష కేంద్రం నుంచి ఎగిరిన సుమారు 15 నిమిషాల తర్వాత శాటిలైట్ విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశించింది. సుమారు 520 కిలోమీటర్ల ఎత్తులో ఆ కక్ష్య ఉన్నట్లు ఇస్రో చెప్పింది. న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్(ఎన్ఎస్ఐఎల్), అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్‌మొబైల్ మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా బ్లూబర్డ్ శాటిలైట్‌ను ప్రయోగించారు. లో ఎర్త్ ఆర్బిట్‌లో బ్లూబర్డ్ శాటిలైట్ విహరించనున్నది. మొబైల్ సర్వీసులు అందించేదుకు ఈ శాటిలైట్‌ను ప్రయోగించారు. 4జీ, 5జీ వాయిస్, వీడియో కాల్స్, టెక్స్టలు, స్ట్రీమింగ్, డేటా ఎప్పుడైనా, ఎక్కడైనా ఈ శాటిలైట్ ద్వారా అందించనున్నారు. లో ఎర్త్ ఆర్బిట్‌లో మోహరించిన అతిపెద్ద కమర్షియల్ కమ్యూనిషేన్ శాటిలైట్‌గా దీన్ని గుర్తిస్తున్నారు. విజయవంతంగా శాటిలైట్ పరీక్ష చేపట్టిన ఇస్రో బృందంపై కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసలు కురిపించారు. రాకెట్ నిప్పులు చిమ్ముతూ ఆకాశంలోకి దూసుకెళ్లిన కేవలం 15 నిమిషాల్లోనే, మూడు దశలను విజయవంతంగా పూర్తి చేసుకుని ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చింది. సుమారు 6,100 కిలోల బరువున్న ఈ భారీ ఉపగ్రహాన్ని మోసుకెళ్లడం ద్వారా, ఇస్రో తన రాకెట్ సామర్థ్యాన్ని ప్రపంచానికి మరోసారి చాటిచెప్పింది. అమెరికాకు చెందిన ప్రయోగం విజయవంతం కావడంతో శ్రీహరికోటలో పండుగ వాతావరణం నెలకొంది. శాస్త్రవేత్తలు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వాణిజ్యపరంగా అత్యంత బరువైన ఉపగ్రహాన్ని ప్రయోగించి, ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించడంలో ఇస్రో సఫలీకృతమైంది. స్పేస్ మొబైల్ సంస్థ రూపొందించిన ఈ ఉపగ్రహం సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది: హై-స్పీడ్ కనెక్టివిటీ: ఇది నేరుగా మొబైల్ ఫోన్లకు స్పేస్ బేస్డ్ సెల్యులార్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందిస్తుంది. సేవలు: మారుమూల ప్రాంతాల్లో సైతం అదుతేమైన వాయిస్ కాల్స్, వీడియో కాల్స్, మెసేజ్‌లు మరియు డేటా సేవలను పొందవచ్చు. బహుళ ప్రయోజనాలు: వాణిజ్య అవసరాలతో పాటు ప్రభుత్వ అనుబంధ అప్లికేషన్లకు కూడా ఇది మద్దతు ఇచ్చేలా డిజైన్ చేయబడింది. భారీ ఉపగ్రహాలను కచ్చితత్వంతో కక్ష్యలోకి ప్రవేశపెట్టడంలో ఇస్రోకు సాటిలేదని ఈ ప్రయోగం మరోసారి నిరూపించింది. ప్రధాని మోదీ విజన్‌ను సక్రమంగా నిర్వర్తిస్తున్నారని ఇస్రోను మెచ్చుకున్నారు. ఒక విజయం తర్వాత మరో విజయాన్ని నమోదు చేస్తూ అంతరిక్ష టెక్నాలజీ రంగంలో భారత సామర్థ్యాన్ని చాటుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

# ముంబయి మేయర్ పీఠం మాదే'- 20 ఏళ్ల తర్వాత ఏకమైన ఠాక్రే సోదరులు





**మహారాష్ట్ర :** రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఠాక్రే సోదరులు ఏకమయ్యారు. ముంబయిలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న ఉద్ధవ్-రాజ్‌ఠాక్రేలు జనవరి 15న జరిగే బృహన్ ముంబయి మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని అధికారికంగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. దేశ ఆర్థిక రాజధాని ముంబయి మేయర్ పదవి తమదేనని శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ్‌సేన అధినేత రాజ్‌ఠాక్రేలు ధీమా వ్యక్తంచేశారు. అదే రోజు జరిగే నాశిక్ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల కోసం ఇప్పటికే రెండు పార్టీల మధ్య స్థానాల సర్దుబాటు చర్చలు పూర్తయ్యాయని 20 ఏళ్ల తర్వాత ఒక్కటైన ఠాక్రే సోదరులు ప్రకటిం చారు. త్వరలో ముంబయికి తమ పార్టీల నుంచి మరాఠీ మేయర్ రాబోతున్నారని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇచ్చిన బటేంగే తో కాటేంగే నినాదాన్ని జపించిన ఉద్ధవ్‌ఠాక్రే, ఐక్యత లోపిస్తే పరిస్థితి వినాశకరంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. శిందే-శివసేన-బీజేపీలతో అసంతృప్తిగా ఉన్న నేతలంతా తిరిగి తమ పార్టీల్లో చేరాలని రాజ్‌ఠాక్రే పిలుపునిచ్చారు. 2005లో శివసేన అధినేత బాల్‌ఠాక్రే బతికి ఉన్నప్పుడు ఉద్ధవ్, రాజ్‌లు విడిపోయారు. శివసేన నుంచి బయటికి వచ్చిన రాజ్ మహారాష్ట్ర నవనిర్మాణ్ సేనను స్థాపించారు. 20 ఏళ్ల తర్వాత మళ్లీ వారిద్దరు ఒక్కడవడం మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది

# హిందువులు కనీసం నలుగురు పిల్లలను కనాలి అప్పుడే వారి కుట్రలను తిప్పికొట్టగలం



బీజేపీ నేత, అమరావతి మాజీ ఎంపీ నవనీత్ రాణా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హిందువులు కనీసం ముగ్గురు లేదా నలుగురు పిల్లలకు జన్మనివ్వాలని సూచించారు. ఎక్కువ మంది పిల్లలను కని హిందుస్థాన్‌ను పాకిస్థాన్‌గా మార్చాలని చూస్తున్న కొంతమంది కుట్రలను తిప్పికొట్టాలని ఆమె అన్నారు. "హిందువలందరికీ నేను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాను. కొంతమంది బహిరంగంగానే నాకు నలుగురు భార్యలు, 19 మంది పిల్లలు ఉన్నారని చెబుతున్నారు. మనం కూడా కనీసం ముగ్గురు లేదా నలుగురు పిల్లలకు జన్మనివ్వాలి. ఆయన మౌలానా లేదా మరెవరో నాకు తెలియదు. కానీ, అతడు నాకు నలుగురు భార్యలు, 19 మంది పిల్లలు ఉన్నారని చెప్పాడు. వారు అధిక సంఖ్యలో పిల్లల్ని కని హిందుస్థాన్‌ను పాకిస్థాన్‌గా మార్చాలని చూస్తున్నారు. ఇలాంటి సమయంలో మరి మనమెందుకు ఒకే పిల్లాడికే పరిమితమవ్వాలి. మనం కూడా ముగ్గురు లేదా నలుగురు పిల్లలను కనాలి" అని అన్నారు.

# ఎయిర్ ప్యూరిఫయర్‌పై జీఎస్టీ తగ్గించండి



**న్యూఢిల్లీ:** ఢిల్లీలో తీవ్ర వాయు కాలుష్యం ఉన్న విషయం తెలిసిందే. అయితే ఎయిర్ ప్యూరిఫయర్‌లపై జీఎస్టీ తగ్గించకపోవడం పట్ల ఢిల్లీ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. వాయు నాణ్యతను దృష్టిలో పెట్టుకుని, దానిని ఎమర్జెన్సీగా భావించి ఎయిర్ ప్యూరిఫయర్లపై పన్నులు తగ్గించాలని కోర్టు కోరింది. చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావు గేదెలతో కూడిన ధర్మాసనం ఈ కేసులో వాదనలు చేపట్టింది. ఎయిర్ ప్యూరిఫయర్లను మెడికల్ డివైస్‌లుగాభావించి, వాటిపై ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి చేర్చాలని కోర్టులో పిల్ వేశారు. అయితే ఈ అంశంలో ఏమీ చేయలేకపోవడంతో ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రతి పౌరుడికి స్వచ్ఛమైన గాలి కావాలని, కానీ అధికారులు నాణ్యమైన గాలిని అందివ్వలేకపోతున్నట్లు ధర్మాసనం పేర్కొన్నది. ప్రతి రోజు మనిషి సగటున 21వేల సార్లు శ్వాస పీల్చుకుంటారని అంటే అన్ని సార్లు వాయువు పీలిస్తే దాని వల్ల ఎంత హాని జరుగుతుందో అంచనా వేసుకోవానల్నారు. కపిల్ మదన్ అనే వ్యక్తి ఈ పిటీషన్ వేశారు. తీవ్ర సంక్షోభం వేళ ఎయిర్ ప్యూరిఫయర్లను లగ్జరీ ఐటమ్‌లుగా భావించవద్దు అన్నారు.

# రూ.12,015 కోట్లతో ఢిల్లీ మెట్రో విస్తరణ



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారంనాడు జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ మెట్రో ఫేజ్ 5(ఏ) విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.12,015 కోట్లు కేటాయించారు. 13 కొత్త స్టేషన్లను కలుపుతూ 16 కిలోమీటర్ల మేరకు ఈ విస్తరణ పనులు చేపడతారు. దీంతో రాబోయే మూడేళ్లలో ఈ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్ 400 కిలోమీటర్ల మార్క్‌ను చేరనుంది. ఫేజ్ 5 (ఏ)లో భాగంగా 16 కిలోమీటర్ల మేర 3 నూతన కారిడార్లను ఢిల్లీ మెట్రో కార్పొరేషన్ (డీఎంఆర్సీ) నిర్మించనున్నట్టు కేబినెట్ సమావేశానంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు తెలిపారు. ఢిల్లీ మెట్రో చరిత్రలో ఇదొక మైలురాయని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో 33,000 టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చని, రాబోయే మూడేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఢిల్లీ మెట్రో ఆపరేషనల్ లెంగ్త్ 400 కిలోమీటర్లను అధిగమిస్తుందని, ప్రపంచంలోనే అతి పెద్ద అర్బన్ రైల్ నెట్‌వర్క్‌గా నిలుస్తుందని వివరించారు.

# సేవ్ ఆరావళి కోసం ఉద్యమించాలి !

ఇప్పటికే ప్రకృతి విధ్వంసం యధేచ్చగా సాగుతోంది. దేశంలో ప్రకృతిని రక్షించాలన్న బాధ్యత ప్రభుత్వాలకు లేకుండా పోయింది. యధారాజా తథా ప్రజా అన్నట్లుగా ప్రజలు కూడా ఈ విధ్వంసంలో పాలుపంచుకుంటున్నారు. గ్రామాల్లో చెరువులు, కుంటలు, చిన్నచిన్న గుట్టలు మాయం అవుతున్నాయి. ఇసుకను తోడేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. దీని ప్రభావంతో వాతావరణ మార్పులు తీవ్రంగా చోటుచేసుకుంటున్నాయి. దీనికతోడు విపరీతమైన ప్లాస్టిక్ ఎక్కడ పడితే అక్కడ గుట్టలుగా పేరుకుపోతోంది.చెరువులు, నదులు, సముద్రాలు కలుషితం అవుతున్నా ప్రభుత్వాల్లో చీమకుట్టినట్లుగా కూడా లేదు. దీంతో పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. దీనికితోడు ప్రకృతి విధ్వంసం ఆపాల్సిన ప్రభుత్వాలు చోద్యం చూడడమే గాకుండా ప్రృకృతిని విధ్వంసం చేస్తున్నాయి. ఆంధ్రాలో సముద్రతీరంలో ఉన్న మడ అడువులను ధ్వసం చేశార. అలాగే రుషికొండను ధ్వంసం చేసి జగన్ విలాసవంతమైన భవనాలు కట్టుకున్నాడు. కొల్లేరు సరస్సు పూర్తిగా ధ్వంసం అయ్యింది. హైదరాబాద్ లో హుస్సేన్ సాగర్ కాలుష్య కాసారంగా మారింది. ఇవన్నీ కొన్ని మాత్రమే. ఎందరో ఆందోళనలు చేసినా, చిప్కో లాంటి ఉద్యమాలు వచ్చినా కదలిక రాకపోవడం దారుణం కాక మరోటి కాదు. కేరళ విలయం చూసిన తరవాత కూడా ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదు. ఉత్తరాఖండ్ విలయం చూసినా కొండలను విధ్వంసం చేయడం ఆపడం లేదు. తాజాగా ప్రకృతి నిర్మించిన రక్షణ కవచం ఆరావళి పర్వత శ్రేణులను కూడా విధ్వంసం చేసే కార్యక్రమం మొదలు కావడం ఈ దేశం చేసుకున్న దౌర్భాగ్యం తప్ప మరోటి కాదు. అటవీ, జల, ఖనిజ ఇతర సహజ వనరులను అందిస్తూ.. నాలుగు రాష్ట్రాల సామాజిక, ఆర్థిక ప్రగతికి దోహద పడుతున్న ఆరావళిలోని 90 శాతం ప్రాంతాలకు మైనింగ్, రియల్ ఎస్టేట్ ముప్పు పొంచి వుంది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు హర్యానా, రాజస్థాన్, గుజరాత్ వరకూ దాదాపు 700 కిలోమీటర్ల మేర విస్తరించివున్న ఈ పర్వత శ్రేణి థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుక,



ధూళిని అడ్డుకోవడంలో కీలకమైనవని ఫారెస్ట్ సర్వీ ఆఫ్ ఇండియా నివేదిక స్పష్టం చేస్తోంది. యూరోపియన్ దేశాల్లో ప్రకృతిని రక్షించేందుకు పాటుపడుతుంటే, మనం మాత్రం విధ్వంస రచన చేస్తున్నాం. మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచిపెట్టేందుకు కేంద్రం రంగం సిద్ధం చేస్తున్నట్లుగా వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.. వందల కోట్ల సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన ప్రపంచంలోనే అతి పురాతన మడత పర్వత శ్రేణుల్లో ఒకటైన ఆరావళిని విధ్వంసం చేసుకోవ డమంటే మనదేశాన్ని మనం నాశనం చేసుకోవడమే. కూర్చున్న కొమ్మను నరుక్కోవడమే అవుతుంది. ఇక్కడ ఖనిజాల కోసం పర్వత శ్రేణులను ధ్వంసం చేసే యత్నాలు అడ్డుకోవాల్సిందే. ఇక్కడ తవ్వకాలకు ఆమోదం తెలపడం అంటే పర్యావరణానికి, జీవ కారుణ్యానికే కాదు.. మానవ మనుగడకే ప్రమాదకరంగా భావించాలి. సామాజిక మాధ్యమ వేదికల్లో ఉత్తరాదిన ప్రారంభమైన 'సేవ్ ఆరావళి క్యాంపెయిన్' రోజురోజు కూ దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. ఉత్తర భారతానికి పచ్చని పరుపులా ఉన్న ఆరావళిని కాపాడాలన్న హ్యాష్ ట్యాగ్‌లతో విద్యావంతులు, మేధావులు, పర్యావరణ వేత్తలు, నిపుణులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. అక్రమ మైనింగ్‌ను ఎలా చట్టబద్ధం చేస్తారని కేంద్రాన్ని నిలదీస్తున్నారు. పీపుల్ ఫర్ ఆరావళీస్' సంస్థ ఇచ్చిన



నివేదిక ప్రకారం అనూహ్యంగా పెరిగిన పట్టణీకరణ, ఖనిజాన్వేషణలతో అడవుల్లో ముమ్మరంగా సాగుతున్న తవ్వకాలు, నివాస ప్రాంతాల విస్తరణ వల్ల హర్యానా, రాజస్థాన్‌లోని ఛార్ఖీ దాద్రి, భివాని జిల్లాల్లో పర్వతాలు ధ్వంసమై జీవవైవిధ్యం నాశనమైంది. ఒక్క రాజస్థాన్‌లోనే దాదాపు 25శాతం కొండలు హరించుకు పోయాయని 2018లోనే సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార సంఘం తేల్చిచెప్పింది. 25 వేలకుపైగా ఎకరాల్లో కొండలు కనుమరుగయ్యాయి. 2011-17 మధ్యలో ఆరావళి శ్రేణుల నుంచి 9.80 లక్షల టన్నుల ఖనిజ వనరులను అక్రమంగా తరలించారనేది కాగ్ నివేదిక తెలిపింది. మైనింగ్, రియల్ ఎస్టేట్ అక్రమాలపై నాలుగు వేలకుపైగా కేసులు న్యాయస్థానాల్లో మూలుగున్నాయి. హర్యానాలోని ఫరీదాబాద్ పరిసర ప్రాంతాల్లో ఖనిజ తవ్వకాలను 2002లోనూ, నాలుగు రాష్టాల్లో్ తవ్వకాలను 2009లోనూ నిషేధిస్తూ సుప్రీంకోర్టు తీర్పులిచ్చినా అమలు చేసే బాధ్యతల నుంచి ప్రభుత్వాలు తప్పుకున్నాయి. పర్వతాల స్వరూపం మార్చకూడదన్న సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు చుట్టూ మైనింగ్ జరుగుతుంటే ఎలా అమలవు తాయన్న ఆలోచన చేయడం లేదు. ఢిల్లీ నుంచి థార్ వరకూ ఎడారిగా మారుతుందని, భూగర్భ జలాలు అడుగంటతాయని, వాయు కాలుష్యంతో ఢిల్లీసహా ఆయా రాష్ట్రాల నుంచి వలస పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందంటున్న పర్యావరణవేత్తల హెచ్చరికలు పాలకుల చెవికెక్కడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న 'ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టు'ను ప్రారంభించిన ప్రధాని ఢిల్లీ నుంచి గుజరాత్ వరకూ అడవులు పెంచడమే లక్ష్యమన్నారు. వేలాది ఏళ్ళుగా పర్యావరణానికి పెట్టని కోటగా ఉన్న ఆరావళిని కాపాడుకోవడం, భవిష్యత్ తరాలకు భద్రంగా అప్పగించడం, 'సేవ్ ఆరావళి'కి మద్దతు పలకడం మనందరి బాధ్యత. మన రాష్ట్రంలోనూ లేటరైట్, బాక్సైట్ తదితర విలువైన ఖనిజాలను తవ్వి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు అత్యుత్సాహం చూపే పర్యావరణ వినాశక చర్యలకు అడ్డుకట్ట పడాలి. పర్యావరణ విధ్వంసం చేసే ఎలాంటి చర్యలనైనా ప్రజలు ప్రతిఘటించాలి. మనకెందుకులే అనుకుంటేరేపటి మనతరం అంతం కావడం ఖాయం.

---

## హెచ్-1 వీసా ఫీజుపై కోర్టులో సవాల్

### దావాను తిరస్కరించిన ఫెడరల్ జడ్జ్

**వాషింగ్టన్,డిసెంబర్24:** హెచ్-1బి వీసాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన లక్ష డాలర్ల భారీ ఫీజును సవాలు చేస్తూ యుఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ వేసిన దావాను ఫెడరల్ జడ్జి మంగళవారం తిరస్కరించారు. ఇది వలసల నియంత్రణపై అధ్యక్షుని విస్తృత అధికారాల పరిధి కిందకు వస్తుందని అన్నారు. ఈ రుసుము సమాఖ్య వలస చట్టానికి విరుద్ధంగా ఉందని, దీంతో పలు కంపెనీలు, ఆస్పత్రులు, ఇతర యజమానులు ఉద్యోగాలను, ప్రజలకు అందించే సేవలను తగ్గించుకోవాల్సి వస్తుందన్న యుఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ వాదనలను వాషింగ్టన్ డిసిలోని యుఎస్ డిస్టిక్ట్ జడ్జి బెరిల్ హోవెల్ తోసిపుచ్చారు.విధాన నిర్ణయం చట్టబద్ధతను అంచనా వేయడం మాత్రమే కోర్టు పరిధిలో ఉందని, దాని అర్హతను నిర్ణయించడం కాదని జడ్జిహోవెల్ పేర్కొన్నారు. విధాన నిర్ణయం నిర్దేశించిన ప్రకటనలో వ్యక్తీకరించబడిన చర్యలు చట్టం పరిమితులకు లోబడి ఉన్నంతవరకు వాటిని సమర్థించాల అని అన్నారు.హెచ్-1బి వీసాలతో అమెరికా కార్మికులును స్థానభ్రంశం చేస్తుందనే తన వాదనకు ట్రంప్ తగిన మద్దతు ఇచ్చారని జస్టిస్ హోవెల్ పేర్కొన్నారు. హెచ్-1బి వీసాల కోసం




వేలాది మంది అమెరికన్లను తొలగించిన కంపెనీలను కూడా ఉదహరించారని అన్నారు. స్టిస్ హోవెల్‌ను అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా నియమించారు.చిన్న మరియు మధ్యతరహా వ్యాపారాలు ఈ రుసుమును భరించలేవని చాంబర్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు, చీఫ్ కౌన్సిల్ డారిల్ జోసెఫర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు నిర్ణయంతో తాము నిరాశ చెందామని అన్నారు. మరిన్ని చట్టపరమైన ఎంపికలను పరిశీలిస్తున్నామని అన్నారు.హెచ్1బి వీసా రుసుము పెంపుపై పలు కార్మికసంఘాలు, విద్యావేత్తలు, మతసంస్థలు కూడా కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.



## అమెరికా నార్త్‌కరోలినాలో కూలిన వ్యాపార జెట్

### విమానంలోని ఏడురుగు దుర్మరణం

**న్యూయార్క్,డిసెంబర్24:** అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రంలో ఒక వ్యాపార జెట్ కూలిపోయి, విమానంలో ఉన్న ఏడుగురు మరణించారు. నాస్కర్ బృందాలు మరియు ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఉపయోగించే నార్త్ కరోలినాలోని ప్రాంతీయ విమానాశ్రయంలో ఈ ప్రమాదం జరిగింది. రిటైర్డ్ నాస్కర్ డ్రైవర్ గ్రెగ్ బిఫిల్, అతని కుటుంబంతో సహా విమానంలో ఏడుగురు వ్యక్తులు ఉన్నారని అధికారులు తెలిపారు. ప్రమాదం తర్వాత విమానం పేలి పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదం గ్రెగ్ బిఫిల్ నడుపుతున్న కంపెనీకి రిజిస్టర్ చేయబడిన సెస్నా అ550 విమానం షార్లెట్‌కు ఉత్తరాన 72 కిలోమీటర్ల దూరంలో ఉన్న స్టేట్స్‌విల్లే ప్రాంతీయ విమానాశ్రయం నుండి బయలుదేరింది. కానీ ల్యాండ్ చేయడానికి ప్రయత్నిస్తుండగా కూలిపోయిందని నార్త్ కరోలినా హైవే పెట్రోల్ తెలిపింది. ప్రమాదం జరిగిన సమయంలో చినుకులు, మేఘావృతమైన వాతావరణం ఉందని ంఇఇబీచిIజీబిరIస వాతావరణ సంస్థ నివేదించింది. ఈ్గ÷తిణరబింలిజీసI.ఇనీప పోస్ట్ చేసిన ట్రాకింగ్ డేటా ప్రకారం, విమానం ఉదయం 10 గంటల తర్వాత విమానాశ్రయం నుండి బయలుదేరింది, కానీ తిరిగి ల్యాండ్ అయ్యే ప్రయత్నంలో కూలిపోయి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంపై జాతీయ రవాణా భద్రతా బోర్డు ,ఎఫ్ఎ దర్యాప్తు ప్రారంభించాయి.

---

# మేడారం మహాజాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు

### గద్దెలపై కొలువుదీరిన పగిడిద్దరాజు, గోవిందరాజులు
### సంప్రదాయ గిరిజన పద్దతిలో పూజల నిర్వహణ
### కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, అధికారులు

**ములుగు,డిసెంబర్24:** మేడారం మహాజాతర కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువు దీరారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గోవిందరాజును బుధవారం ఉదయం 6 గంటలకు, పగిడిద్దరాజును 9.45 గంటలకు పూజారులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులను గద్దెల ప్రాంగణంలోకి రానివ్వకుండా భద్రత



ఏర్పాట్లు చేపట్టారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులు కుటుంబాలతోపాటు హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. మేడారం జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరుగనుంది. దీనికి తెలంగాణతోపాటు చుట్టుపక్కల ఉండే రాష్ట్రాలనుంచి కోటి మందికిపైగా భక్తులు తరలి వస్తారని అంచనా.ఈ సారిగా నూతనంగా నిర్మించిన గ్దదెలపై సమ్మక్క, సారలమ్మతోపాటు పగిడిద్ద రాజు, గోవిందరాజులను కొలువుదీర్చుతున్నారు. జాతర ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. దాని మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. గ్దదెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పు ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది. పగిడిద్దరాజు, గోవింద రాజు గ్దదెలను సమ్మక్క-సారలమ్మ గ్దదెలు ఉండే వరుస లోకి మార్చారు. ఈ ఏర్పాటు ద్వారా భక్తులంతా ఒక వరుసలో దర్శనానికి వెళ్లేందుకు వీలు కలుగనుంది. వృత్తాకారంలో ఉండే గ్దదెల చుట్టూ 8 స్తంభాలు ఉంటాయి. వాటి మధ్యలో వెదురు బొంగులతో డెకరేషన్ చేస్తారు.

TGTEL/25/A3750
... నిజమే ...
నిజాయితీ
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక
గురువారం, డిసెంబర్ 25, 2025


# బ్యాట్ పడితే బంతి స్టాండ్స్‌లో పడాల్సిందే



అండర్-19 ఆసియా కప్ 2025 ఫైనల్‌లో భారత్ ఓటమి పాలైనప్పటికీ, ఆ జట్టు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ మాత్రం ఒక అద్భుతమైన ప్రపంచ రికార్డుతో చరిత్ర సృష్టించాడు. కేవలం 14 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో సిక్సర్ల వర్షం కురిపిస్తూ, సౌతాఫ్రికా సంచలనం డెవాల్డ్ బ్రెవిస్ పేరిట ఉన్న రికార్డును తుడిచిపెట్టేశాడు. మల్టీ నేషన్ అండర్-19 టోర్నమెంట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. 2022 అండర్-19 ప్రపంచకప్‌లో సౌతాఫ్రికా ప్లేయర్ డెవాల్డ్ బ్రెవిస్ (బేబీ ఏబీ) 18 సిక్సర్లు కొట్టి ఈ రికార్డు సృష్టించగా.. తాజా ఆసియా కప్‌లో వైభవ్ ఏకంగా 20 సిక్సర్లు బాది అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఈ టోర్నీలో పాకిస్థాన్ ఆటగాడు సమీర్ మిన్హాజ్ కూడా 19 సిక్సర్లతో బ్రెవిస్‌ను దాటగా, వైభవ్ అతడిని కూడా వెనక్కి నెట్టి నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ ఆసియా కప్‌లో వైభవ్ ఆడిన 5 మ్యాచ్‌ల్లో 52.20 సగటుతో 261 పరుగులు చేశాడు. అతని స్ట్రైక్ రేట్ ఏకంగా 182.51గా ఉండటం విశేషం. ముఖ్యంగా యూఏఈ పై ఆడిన 171 పరుగుల ఇన్నింగ్స్‌లో అతను 14 సిక్సర్లు బాది అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఇక పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్‌లో భారత్ 191 పరుగుల భారీ తేడాతో ఓడిపోయినప్పటికీ, వైభవ్ మాత్రం 10 బంతుల్లోనే 3 సిక్సర్లతో 26 పరుగులు చేసి తన మార్కును చాటుకున్నాడు. యూత్ వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు బాదిన రికార్డు కూడా ఇప్పుడు వైభవ్ పేరు మీదనే ఉంది. మొత్తం 60 సిక్సర్లతో అతను అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. గతంలో భారత మాజీ అండర్-19 కెప్టెన్ ఉన్ముక్త్ చంద్ 38 సిక్సర్లతో ఉన్న రికార్డును వైభవ్ చాలా సునాయాసంగా దాటేశాడు. ఈ ఏడాదిలోనే వైభవ్ ఐపీఎల్?లో రాజస్థాన్ రాయల్స్ తరపున అరంగేట్రం చేయడం, అలాగే సీనియర్ స్థాయిలో టీ20 సెంచరీలు బాదడం వంటి అరుదైన సాధించాడు.

# విజయ్ హజారే ట్రోఫీ రోహిత్, కోహ్లీ బ్యాటింగ్ చూడాలి



చాలా కాలం తర్వాత భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ దేశవాళీ క్రికెట్ మైదానంలో అడుగుపెడుతున్నారు. విజయ్ హజారే ట్రోఫీ (%ఎఱ%) 2025 లో భాగంగా డిసెంబర్ 24 నుంచి వీరిద్దరూ తమ తమ జట్ల తరపున బరిలోకి దిగుతున్నారు. బీసీసీఐ కొత్త నిబంధనల ప్రకారం.. సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లు కచ్చితంగా దేశవాళీ మ్యాచ్‌లు ఆడాలన్న ఆదేశంతో ఈ ఇద్దరు స్టార్లు గ్రౌండ్‌లోకి వస్తున్నారు. దాదాపు 15 సంవత్సరాల తర్వాత విరాట్ కోహ్లీ విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతుండటం విశేషం. రిషబ్ పంత్ సారథ్యంలోని ఢిల్లీ జట్టు తరపున కోహ్లీ బరిలోకి దిగుతున్నాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుతో ఢిల్లీ తలపడనుంది. నిజానికి ఈ మ్యాచ్ చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సి ఉంది, కానీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల వేదికను మార్చారు. ఇటు పంత్, అటు కోహ్లీ ఒకే జట్టులో ఉండటంతో ఈ మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మరోవైపు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తన సొంత జట్టు ముంబై తరపున ఆడుతున్నాడు. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో సిక్కిం జట్టుతో ముంబై తలపడనుంది. శార్దూల్ ఠాకూర్ కెప్టెన్సీలో రోహిత్ శర్మ బరిలోకి దిగుతుండటం గమనార్హం. అంతర్జాతీయ వన్డేల్లో భీకర ఫామ్‌లో ఉన్న రోహిత్, దేశవాళీ పిచ్‌లపై ఎలాంటి విన్యాసాలు చేస్తాడోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఇక్కడ టైమింగ్స్ మారాయి. ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు మధ్యాహ్నం 1:30కి మొదలైతే, ఈ మ్యాచ్‌లు ఉదయం 9:30 గంటలకే ప్రారంభమవుతాయి. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూడాలనుకున్న అభిమానులకు చేదు వార్త మిగిలింది. కోహ్లీ ఆడుతున్న ఢిల్లీ ఆంధ్ర మ్యాచ్ కానీ, రోహిత్ ఆడుతున్న ముంబై సిక్కిం మ్యాచ్ కానీ టీవీల్లో ప్రసారం కావడం లేదు. అలాగే ఎటువంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లోనూ లైవ్ స్ట్రీమింగ్ అందు బాటులో లేదు. కేవలం సెలక్టెడ్ కొన్ని మ్యాచ్‌లను మాత్రమే స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్, జియో హాట్‌స్టార్ ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నాయి. విరాట్, రోహిత్ మ్యాచ్‌లు ఈ లిస్టులో లేకపోవడం ఫ్యాన్స్‌ను నిరాశకు గురిచేస్తోం ది. ఈ ఏడాది నుంచి బీసీసీఐ ఒక కొత్త రూల్ తెచ్చింది. దీని ప్రకారం సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లు కచ్చితంగా సీజన్‌లో కనీసం రెండు దేశవాళీ మ్యాచ్‌లు ఆడాలి. ఈ నిబంధన వల్లే కోహ్లీ, రోహిత్ వంటి సీనియర్లు మళ్ళీ లోకల్ గ్రౌండ్స్‌లో కనిపిస్తున్నారు. ఇది యువ ఆటగాళ్లకు గొప్ప అనుభవాన్ని ఇవ్వడమే కాకుండా, దేశవాళీ క్రికెట్‌కు పెంచుతుందని బోర్డు భావిస్తోంది. మరి ఈ దిగ్గజాలు తమ జట్లను విజయతీరాలకు చేరుస్తారో లేదో చూడాలి.

# వన్డే సిరీస్‌కు కేన్ విలియమ్సన్ దూరం



భారత్‌లో జరగనున్న వైట్ బాల్ సిరీస్ కోసం న్యూజిలాండ్ రెండు ఫార్మాట్లకు క్రికెట్ జట్లు ప్రకటించింది. ఈ పర్యటనలో ముఖ్యమైన అంశం ఏంటంటే, స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ వన్డే జట్టుకు అందుబాటులో లేకపోవడం. ఎస్ఏ20 లీగ్‌లో పాల్గొనే కారణంగా విలియమ్సన్ వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. ఇదే సమయంలో, లెఫ్ట్ ఆర్మ్ ఆర్థోడాక్స్ బౌలర్ జేడెన్ లెన్నాక్స్‌కు తొలిసారి జాతీయ జట్టులో అవకాశం దక్కింది. భారత్ పర్యటనలో భాగంగా జరిగే వన్డే సిరీస్‌కు అతడిని ఎంపిక చేయడం విశేషంగా నిలిచింది. వన్డే సిరీస్‌లో మిచెల్ శాంట్నర్ అందుబాటులో లేకపోవడంతో మైకెల్ బ్రేస్‌వెల్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. అతడికి డెవాన్ కాన్వే, డెరిల్ మిచెల్, విల్ యంగ్, హెన్రీ నికోల్స్ వంటి అనుభవజ్ఞుల మద్దతు లభించనుంది. టీ20 సిరీస్‌లో మాత్రం గాయాల నుంచి కోలుకుంటున్న మిచెల్ శాంట్నర్ తిరిగి జట్టులోకి వచ్చి, అదే సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. అయితే అతడిని కేవలం టీ20 జట్టుకే పరిమితం చేశారు.


టెస్ట్ కెప్టెన్ టామ్ లాథమ్ కుటుంబ కారణాల వల్ల వన్డే సిరీస్‌కు దూరంగా ఉండగా, పేసర్ మ్యాట్ హెన్రీ కాలి గాయం కారణంగా విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఇదే విధంగా నాథన్ స్మిత్, బ్లేర్ టిక్‌నర్, మార్క్ చాప్మన్ కూడా వన్డే ఎంపికకు అందుబాటులో లేరు. జేమ్స్ నీషమ్, ఇష్ సోధి మళ్లీ జట్టులోకి వచ్చారు. దేశీయ క్రికెట్‌లో మంచి ప్రదర్శన బేవన్ జేకబ్స్, టిమ్ రాబిన్సన్‌కు టీ20 జట్టులో అవకాశం దక్కింది.

ఐపీఎల్ ఒప్పందాలు పొందిన జాకబ్ డఫీ, జాక్ ఫౌల్క్స్ కూడా ఎంపికయ్యారు. ఫౌల్క్స్‌కు ఇది భారత్‌లో తొలి టీ20 అనుభవం కానుంది. జేడెన్ లెన్నాక్స్ ఎంపికపై హెడ్ కోచ్ రాబ్ వాల్టర్ స్పందిస్తూ, అతడు చాలా కాలంగా న్యూజిలాండ్ హై-పర్ఫార్మెన్స్ సిస్టమ్‌లో నిలకడగా రాణిస్తున్నాడని ప్రశంసించాడు. దేశీయ వైట్ బాల్ క్రికెట్‌లో తడి ప్రదర్శన ఆధారంగానే ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు. భారత్‌తో సిరీస్‌కు న్యూజిలాండ్ జట్లు ఇవే

వన్డే స్క్వాడ్: మైకెల్ బ్రేస్‌వెల్ (కెప్టెన్), కాన్వే, డారెల్ మిచెల్, విల్ యంగ్, హెన్రీ నికోల్స్, గ్లెన్ ఫిలిప్స్, కైల్ జేమీసన్, జాక్ ఫౌల్క్స్, జేడెన్ లెన్నాక్స్, క్రిస్టియన్ క్లార్క్, ఆది అశోక్, జోష్ క్లార్క్‌సన్, నిక్ కెల్లీ, మైకెల్ రే, మిచ్ హే.

టీ20 స్క్వాడ్: మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), మైకెల్ బ్రేస్‌వెల్, కాన్వే, మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, జేమ్స్ నీషమ్, ఇష్ సోధి, కైల్ జేమీసన్, మ్యాట్ హెన్రీ, జాకబ్ డఫీ, జాక్ ఫౌల్క్స్, బేవన్ జేకబ్స్, టిమ్ రాబిన్సన్, మార్క్ చాప్మన్.

# వామ్మో నాన్‌స్టాప్‌గా పెరుగుతున్న బంగారం ధరలు



పసిడి ధరలు భగ్గుమంటున్నాయి.. రూపాయి బలహీనత ప్రభావం, ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాలతో.. బంగారం, వెండి ధరలు భారీగా పెరుగుతున్నాయి.. గతంలో ఎన్నడూ లేని విధంగా స్వచ్ఛమైన పసిడి ధర ఏకంగా లక్షా 40 వేల మార్క్ కు చేరుకుంది. వారం రోజుల్లోనే బంగారం ధర దాదాపు 4వేల వరకు పెరిగింది. అయితే.. అంతర్జాతీయంగా పసిడి ధరలు భారీగా.. పెరుగుతుండటంతో.. దేశీయంగా కూడా పెరుగుతున్నాయని, మున్ముందు మరింత పెరిగే అవకాశం ఉందని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. తాజాగా.. గోల్డ్, సిల్వర్ ధరలు పెరిగాయి.. పలు వెబ్‌సైట్ల ఆధారంగా.. బుధవారం (డిసెంబర్ 24 2025) ఉదయం నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 380 మేర పెరిగి.. రూ. 1,38,930 గా ఉంది. 22 క్యారెట్ల గోల్డ్ పది గ్రాముల ధర రూ. 350 మేర పెరిగి.. 1,27,350 గా ఉంది. వెండి కిలో ధర రూ. 10వేల మేర పెరిగి.. 2,33,000 గా ఉంది. అయితే.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది. ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా.. హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 1,38,930, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ. 1,27,350 ఉంది. వెండి కిలో ధర రూ. 2,44,000 ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ. 1,38,930, 22 క్యారెట్ల ధర రూ. 1,27,350 ఉంది. కిలో వెండి ధర రూ. 1,44,000 ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ. 1,39,080, 22 క్యారెట్ల ధర రూ. 1,27,500 గా ఉంది. వెండి కిలో ధర రూ. 2,33,000 ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ. 1,38,930, 22 క్యారెట్ల ధర రూ. 1,27,350 గా ఉంది. వెండి కిలో ధర రూ. 2,33,000 లుగా ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ. 1,39,640, 22 క్యారెట్ల ధర రూ. 1,28,000 ఉంది వెండి కిలో ధర రూ. 2,44,000 లుగా ఉంది. కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

# క్రెడిట్ కార్డ్ యూజర్లకు బిగ్ అలర్ట్



డిజిటల్ చెల్లింపుల యుగంలో క్రెడిట్ కార్డులు రోజువారీ అవసరంగా మారాయి. అయితే వాటి సౌలభ్యంతో సైబర్ మోసానికి గురయ్యే ప్రమాదం కూడా అంతే పెరిగింది. సాధారణ నిర్లక్ష్యం వల్ల కార్డు వివరాలు చోరీకి గురి అవుతున్నాయని, ఖాతాల నుండి డబ్బు ఖాళీ అవుతుందని ఇటీవలె కేసులతో తెలుస్తోంది. పెట్రోల్ పంపులు, ఉచిత తెలియని వెబ్‌సైట్‌లు వంటి ప్లాట్‌ఫారమ్‌లు మోసానికి ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయి. అందువల్ల, కార్డ్ వినియోగదారులు గతంలో కంటే మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అసవరం ఉంది . పెట్రోల్ పంపులు, యంత్రాలు, హోటళ్ళు, రెస్టారెంట్లలో మీ కార్డును ఇవ్వడం ప్రమాదకరం. తరచుగా, కార్డు వివరాలు కనిపించకుండా పోయిన వెంటనే కాపీ చేయబడతాయి. ఇంకా తెలియని వెబ్‌సైట్‌లు, ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లు, థర్డ్-పార్టీ యాప్‌లలో కార్డును యాక్సెస్ చేయడం సైబర్ నేరస్థులకు అవకాశాలను అందిస్తుంది. ఉచిత నెట్‌వర్క్‌ల ద్వారా లావాదేవీలు కూడా డేటా దొంగతనం ప్రమాదాన్ని పెంచుతాయి. పెట్రోల్ పంపులు, యంత్రాలు, హోటళ్ళు, రెస్టారెంట్లలో మీ కార్డును ఇవ్వడం ప్రమాదకరం. తరచుగా, కార్డు వివరాలు కనిపించకుండా పోయిన వెంటనే కాపీ చేయబడతాయి. ఇంకా తెలియని వెబ్‌సైట్‌లు, ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లు, థర్డ్-పార్టీ యాప్‌లలో కార్డును యాక్సెస్ చేయడం సైబర్ నేరస్థులకు అవకాశాలను అందిస్తుంది. ఉచిత %ఔఱ-ఖీఱ% నెట్‌వర్క్‌ల ద్వారా లావాదేవీలు కూడా డేటా దొంగతనం ప్రమాదాన్ని పెంచుతాయి. సైబర్ నేరస్థులు నకిలీ లింక్‌లు, ఇమెయిల్‌లు, వెబ్‌సైట్‌ల ద్వారా వినియోగదారులను ఆకర్షిస్తారు. వారు తమ కార్డ్ నంబర్, %జఎఎ% లేదా పాస్‌వర్డ్‌ను పొందిన తర్వాత, వారికి తెలియకుండానే వారి ఖాతాల నుండి డబ్బును విత్‌డ్రా చేసుకుంటారు. చాలా సందర్భాలలో, వినియోగదారులు తమ ఖాతా బ్యాలెన్స్ ఇప్పటికే తగ్గిపోయినప్పుడు మాత్రమే మోసం గురించి తెలుసుకుంటారు. స్పైవేర్, మాల్వేర్ కూడా కార్డ్ డేటా దొంగతనానికి ప్రధాన వనరుగా మారాయి. సైబర్ నేరస్థులు నకిలీ లింక్‌లు, ఇమెయిల్‌లు, వెబ్‌సైట్‌ల ద్వారా వినియోగదారులను ఆకర్షిస్తారు. వారు తమ కార్డ్ నంబర్, లేదా పాస్‌వర్డ్‌ను పొందిన తర్వాత, వారికి తెలియకుండానే వారి ఖాతాల నుండి డబ్బును విత్‌డ్రా చేసుకుంటారు. చాలా సందర్భాలలో, వినియోగదారులు తమ ఖాతా బ్యాలెన్స్ ఇప్పటికే తగ్గిపోయినప్పుడు మాత్రమే మోసం గురించి తెలుసుకుంటారు. స్పైవేర్, మాల్వేర్ కూడా కార్డ్ డేటా దొంగతనానికి ప్రధాన వనరుగా మారాయి. ప్రతి క్రెడిట్ కార్డ్ వినియోగదారుడు లావాదేవీ హెచ్చరికలను యాక్టివ్‌గా ఉంచుకోవాలి. ఇది ప్రతి ఖర్చు గురించి తక్షణ సమాచారాన్ని అందిస్తుంది. నెలవారీ స్టేట్‌మెంట్‌లను జాగ్రత్తగా సమీక్షించడం కూడా చాలా ముఖ్యం. మీకు ఏవైనా తెలియని లావాదేవీలు కనిపిస్తే, వెంటనే మీ బ్యాంకుకు తెలియజేయండి. సకాలంలో ఫిర్యాదును నివేదించడం వల్ల నష్టాలను నివారించవచ్చు. ప్రతి క్రెడిట్ కార్డ్ వినియోగదారుడు లావాదేవీ హెచ్చరికలను యాక్టివ్‌గా ఉంచుకోవాలి. ఇది ప్రతి ఖర్చు గురించి తక్షణ సమాచారాన్ని అందిస్తుంది. నెలవారీ స్టేట్‌మెంట్‌లను జాగ్రత్తగా సమీక్షించడం కూడా చాలా ముఖ్యం. మీకు ఏవైనా తెలియని లావాదేవీలు కనిపిస్తే, వెంటనే మీ బ్యాంకుకు తెలియజేయండి. సకాలంలో ఫిర్యాదును నివేదించడం వల్ల నష్టాలను నివారించవచ్చు. మీ క్రెడిట్ కార్డ్ పాస్‌వర్డ్, పిన్‌ను పంచుకోవడం చాలా ప్రమాదం. వీటిని తరచుగా మార్చాలి. పబ్లిక్ కంప్యూటర్లలో లేదా ఉచిత %ఔఱ-ఖీఱ%లో కార్డ్ వివరాలను నమోదు చేయకుండా ఉండటం ముఖ్యం. దుర్వినియోగాన్ని నివారించడానికి మీ కార్డును ఎల్లప్పుడూ మీ సమక్షంలో స్వైప్ చేయండి. మీ క్రెడిట్ కార్డ్ పాస్‌వర్డ్, పిన్‌ను పంచుకోవడం చాలా ప్రమాదం. వీటిని తరచుగా మార్చాలి. పబ్లిక్ కంప్యూటర్లలో లేదా ఉచిత %ఔఱ-ఖీఱ%లో కార్డ్ వివరాలను నమోదు చేయకుండా ఉండటం ముఖ్యం. దుర్వినియోగాన్ని నివారించడానికి మీ కార్డును ఎల్లప్పుడూ మీ సమక్షంలో స్వైప్ చేయండి.


# చౌకగా మారనున్న మెడిసిన్



చైనాలో యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్‌ధరలు గణనీయంగా తగ్గిన తర్వాత మన దేశంలో మందులు త్వరలో చౌకగా మారవచ్చు. ధరలు తగ్గడం వల్ల జనరిక్ ఔషధ కంపెనీలకు తయారీ ఖర్చులు తగ్గుతాయని, దీనివల్ల ఔషధ ధరలు తగ్గుతాయని నిపుణులు భావిస్తున్నారు. పరిశ్రమలోని వ్యక్తుల ప్రకారం, ధరలు కనీసం 35-40 శాతం తగ్గాయి, రాబోయే నెలల్లో మరిన్ని తగ్గుదలలు ఉంటాయని భావిస్తున్నారు. చైనా నుండి జనరిక్ ఔషధాల తయారీకి దిగుమతి చేసుకునే ముడి పదార్థాల ధరలలో భారతదేశం గణనీయమైన తగ్గుదలని చూసింది. మహమ్మారి సమయంలో పారాసెటమాల్ ధరలు కిలోగ్రాముకు రూ. 900 నుండి రూ. 250కి పడిపోయాయి. గతంలో కిలోగ్రాముకు రూ. 3,200గా ఉన్న అమోక్సిసిలిన్ ఇప్పుడు కిలోగ్రాముకు రూ. 1,800గా ఉంది. అదేవిధంగా కిలోగ్రాముకు రూ. 21,000గా ఉన్న క్లావులనేట్ ప్రస్తుతం కిలోగ్రాముకు రూ. 14,500గా ఉంది. చైనా ఔషధ పరిశ్రమను పర్యవేక్షించే మెహూల్ షా మాట్లాడుతూ.. మేము %ఘూ×% ధరలలో తగ్గుదల చూస్తున్నాం, ఇది సాధారణ రోగులకు ప్రయోజనం చేకూరుస్తుందని మేము ఆశిస్తున్నాం. %జ%తర్వాత వ్యూహాత్మక పెట్టుబడుల కారణంగా చైనాలో ఫ్యాక్టరీల భారీ విస్తరణ ఉత్పత్తిని పెంచింది. సమీప భవిష్యత్తులో మరింత తగ్గుదల ఉంటుందని మేం ఆశిస్తున్నాం అని అన్నారు. చైనాలో ధరలు తగ్గడం వల్ల భారతీయ కంపెనీలకు ఉత్పత్తి ఖర్చులు తగ్గుతాయని భావిస్తున్నారు. దిగుమతుల కోసం భారతదేశం చైనాపై ఎక్కువగా ఆధారపడి ఉంది, దాదాపు 70 శాతం చైనా నుండే వస్తున్నాయి. ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ మాజీ చైర్మన్ దినేష్ దువా మాట్లాడుతూ, ఈ ఆధారపడటం వల్ల భారతీయ తయారీదారులు ధరల హెచ్చుతగ్గులు, సరఫరా గొలుసు అంతరాయాలకు గురవుతారని అన్నారు. మరిన్ని ధరల తగ్గుదలలు ఉంటాయని, దీనివల్ల భారతదేశంలో ఔషధ ధరలు తగ్గుతాయని ఆశిస్తున్నట్లు షా అన్నారు. %చీూూ% దీనిని పర్యవేక్షిస్తుందని, ధర తగ్గింపుకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేస్తుందని మరో నిపుణుడు తెలిపారు.

గురువారం, డిసెంబర్ 25, 2025
TGTEL/25/A3750
... నిజమే ...
నిజాయితి
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక
8

# గన్ పట్టుకున్న మన శంకర వరప్రసాద్ గారు




తెలుగు సినీ పరిశ్రమలో స్టార్ హీరో అనే పదానికి అసలైన అర్థాన్ని ఇచ్చిన చిరంజీవి పేరు వినగానే అభిమానుల్లో ఇప్పటికీ అదే ఉత్సాహం కనిపిస్తుంది. నాలుగు దశాబ్దాల కెరీర్‌లో మాస్, క్లాస్, ఫ్యామిలీ ఆడియన్స్ అందరినీ సమానంగా ఆకట్టుకున్న స్టార్‌గా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. అలాంటి చిరంజీవి, ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతున్న బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి తో కలవడం అనగానే అంచనాలు ఆకాశాన్ని తాకాయి. అనిల్ రావిపూడి అంటేనే ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్, కుటుంబ ప్రేక్షకులకు నచ్చే కథ, అదిరిపోయే కామెడీ, మాస్ టచ్ ఉంటుందన్న నమ్మకం ఉంది. ఈ ఇద్దరి కలయికలో రూపొందుతున్న 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమా మొదటినుంచే హాట్ టాపిక్‌గా మారింది. 'మన శంకర వరప్రసాద్ గారు'పై శివాజీ లీక్.. అనిల్ రావిపూడి వద్దంటున్నా వినకుండామాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నిర్మాతలుగా సాహు గారపాటి, సుస్మిత కొణిదెల వ్యవహరిస్తుండగా, శ్రీమతి అర్చన సమర్పకురాలిగా ఉన్నారు. షూటింగ్ ఇప్పటికే పూర్తి కావడంతో ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రతి అప్‌డేట్‌ను మేకర్స్ ప్లాన్డ్‌గా రిలీజ్ చేస్తూ సినిమాపై ఆసక్తిని నిలబెడుతున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ బజ్‌ను క్రియేట్ చేసింది. ముఖ్యంగా 'మీసాల పిల్ల', 'శశిరేఖ' పాటలు యూట్యూబ్, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో భారీ వ్యూస్‌తో దూసుకుపోయాయి. ఈ పాటలు చార్ట్‌బస్టర్లుగా నిలవడమే కాకుండా, సినిమాకు ఫ్యామిలీ ఆడియన్స్‌లో మంచి రీచ్ తీసుకొచ్చాయి. ఇక చిరంజీవి, విక్టరీ వెంకటేష్‌పై చిత్రీకరించిన ప్రత్యేక పాట కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నట్లు చిత్రబృందం సంకేతాలు ఇస్తోంది. 'శంబాల'తో నా కెరీర్ టర్న్ అవుతుందన్న నమ్మకముందిఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ కీలకమైన ప్రత్యేక పాత్రలో కనిపించనున్న విషయం సినిమాపై అంచనాలను మరింత పెంచింది. చిరంజీవి%-%వెంకటేష్ కలయిక తెరపై చూడడం అభిమానులకు ప్రత్యేక అనుభూతి ఇవ్వనుంది. కథలో వెంకీ పాత్ర చాలా బలంగా ఉండటంతో పాటు, ఎమోషనల్ వెయిట్ కలిగి ఉంటుందని టాక్. ఈ ఇద్దరు సీనియర్ స్టార్స్ మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయని సినీ వర్గాలు

# బ్యూటీ ఫుల్ బర్త్ డే గర్ల్




సోషల్ మీడియా పుణ్యమా అని చాలా మంది ముద్దుగుమ్మలు సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతున్నారు. ప్రభాస్ ఫౌజి హీరోయిన్ ఇమాన్వీ, ఆర్జీవీ శారీ హీరోయిన్ ఆరాధ్య దేవి, పుష్ప 2 ఆంచల్ ముంజాల్, ఏజెంట్ హీరోయిన్ సాక్షి వైద్య అలా వచ్చిన వారే.. వారిలానే సోషల్ మీడియా ద్వారా ఇండస్ట్రీలోకి హీరోయిన్ గా అడుగుపెట్టింది శ్రీదేవి. కోర్ట్ సినిమాతో ఒక్కసారిగా ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది ఈ చిన్నది. కోర్ట్ సినిమాలో జాబిలి అనే పాత్రలో నటించి మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. వారిలానే సోషల్ మీడియా ద్వారా ఇండస్ట్రీలోకి హీరోయిన్ గా అడుగుపెట్టింది శ్రీదేవి. కోర్ట్ సినిమాతో ఒక్కసారిగా ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది ఈ చిన్నది. కోర్ట్ సినిమాలో జాబిలి అనే పాత్రలో నటించి మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. ఈ బ్యూటీ పూర్తి పేరు శ్రీదేవి ఆపళ్ల. ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ లో జన్మించింది ఈ అమ్మడు. శ్రీదేవి ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన ఓ రీల్ చూసి కోర్ట్ సినిమాలో ఆమెకు అవకాశం కల్పించారట దర్శక నిర్మాతలు. ఈ విషయాన్ని కోర్టు మూవీ డైరెక్టర్ రామ్ జగదీష్ స్వయంగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ బ్యూటీ పూర్తి పేరు శ్రీదేవి ఆపళ్ల. ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ లో జన్మించింది ఈ అమ్మడు. శ్రీదేవి ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన ఓ రీల్ చూసి కోర్ట్ సినిమాలో ఆమెకు అవకాశం కల్పించారట దర్శక నిర్మాతలు. ఈ విషయాన్ని కోర్టు మూవీ డైరెక్టర్ రామ్ జగదీష్ స్వయంగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇదిలా ఉంటే కోర్టు సినిమా తర్వాత ఇప్పుడు మరో తెలుగు సినిమా చేస్తుంది. ఇదిలా ఉంటే ఇటీవల ఈ ముద్దుగుమ్మ మరో క్రేజీ ఆఫర్ అందుకుందని తెలుస్తుంది. తమిళ్ లోనూ ఓ సినిమాలో నటిస్తుంది ఈ ముద్దుగుమ్మ. త్వరలోనే ఈ సినిమాకు సంబందించిన అప్డేట్స్ రానున్నాయి. ఇదిలా ఉంటే కోర్టు సినిమా తర్వాత ఇప్పుడు మరో తెలుగు సినిమా చేస్తుంది. ఇదిలా ఉంటే ఇటీవల ఈ ముద్దుగుమ్మ మరో క్రేజీ ఆఫర్ అందుకుందని తెలుస్తుంది. తమిళ్ లోనూ ఓ సినిమాలో నటిస్తుంది ఈ ముద్దుగుమ్మ. త్వరలోనే ఈ సినిమాకు సంబందించిన అప్డేట్స్ రానున్నాయి. కాగా ఇటీవల ఈ అమ్మడి పుట్టిన రోజు సందర్భంగా సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలను పంచుకుంది. ఆ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో క్యూట్ లుక్స్ తో ఆకట్టుకుంది ఈ అందాల భామ. కాగా ఇటీవల ఈ అమ్మడి పుట్టిన రోజు సందర్భంగా సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలను పంచుకుంది. ఆ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో క్యూట్ లుక్స్ తో ఆకట్టుకుంది ఈ అందాల భామ.

# నువ్వో మురికి మనిషివి

నటుడు శివాజీ 'దండోరా' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మహిళల వస్త్రధారణపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర దుమారం





రేపుతున్నాయి. హీరోయిన్లు పబ్లిక్ ఈవెంట్లకు వచ్చినప్పుడు పద్ధతిగా ఉండాలని, గ్లామర్ హద్దులు దాటితే గౌరవం తగ్గుతుందని ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ముఖ్యంగా ఆయన ఉపయోగించిన కొన్ని పదాలు మహిళలను అవమానించేలా ఉన్నాయంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కామెంట్స్‌పై సినీ పరిశ్రమలోనూ శివాజీకి వ్యతిరేకంగా గట్టి నెగెటివిటీ మొదలైంది. ఇప్పటికే గాయని చిన్మయి శ్రీపాద, నటి అనసూయ భరద్వాజ్ శివాజీ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టగా, తాజాగా నటుడు మంచు మనోజ్ కూడా బహిరంగంగా స్పందించారు. మహిళల దుస్తులపై మోరల్ పోలీసింగ్ చేయడం పాతపద్ధతి అని, ఇది అంగీకరించదగిన విషయం కాదని మనోజ్ స్పష్టం చేశారు. మహిళల గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ రాజ్యాంగ హక్కులని, వాటిపై ఎలాంటి రాజీ ఉండదని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలను కించపరిచే మాటలను సహించబోమని, నిశ్శబ్దం ఎంపిక కాదని కూడా మంచు మనోజ్ స్పష్టంగా తెలిపారు. ఈ ప్రకటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారి, ఆయనకు పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. మంచు మనోజ్ స్పందనపై ఆయన సోదరి మంచు లక్ష్మి కూడా ట్విట్టర్ వేదికగా ప్రశంసలు కురిపించారు. "%శీబ ఖతీవ ఖ్ తీబవ పీూచీ. ఎనూచీఖ ాఖ%" అంటూ ఆమె చేసిన ట్వీట్ నెట్టింట వైరల్‌గా మారింది. మహిళల పక్షాన నిలబడి ధైర్యంగా మాట్లాడినందుకు మంచు మనోజ్‌ను పలువురు నెటిజన్లు అభినందిస్తున్నారు. ఈ ట్వీట్‌ను ట్యాగ్ చేస్తూ, వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా శివాజీపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రామ్ గోపాల్ వర్మ తన ట్విట్టర్ ఖాతా ద్వారా సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఆ వ్యక్తి పూర్తి పేరు కూడా నాకు తెలియదు, అందుకే ఇలా వ్యాఖ్యానిస్తున్నాను. హే శివాజీ, నువ్వెవరివైనా కావచ్చు. నీ ఇంట్లోని మహిళలు నీలాంటి మొరటు, మురికి మనిషిని భరించడానికి సిద్ధంగా ఉంటే, నువ్వు వారిని నైతికత పేరుతో నియంత్రించుకో. కానీ సమాజంలో ఉన్న ఇతర మహిళలపై లేదా సినిమా ఇండస్ట్రీలోని మహిళలపై నీ చెత్త అభిప్రాయాలను రుద్దే హక్కు నీకు లేదు" అంటూ ఘాటుగా స్పందించారు. ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఆర్జీవీ వ్యాఖ్యలపై నెటిజన్ల నుంచి భారీ స్పందన వస్తోంది. "కరెక్ట్‌గా చెప్పారు", "ఇదే సరైన కౌంటర్" అంటూ కామెంట్లు పెడుతున్నారు. ముఖ్యంగా మహిళలు రామ్ గోపాల్ వర్మకు ధన్యవాదాలు తెలుపుతూ ఆయన స్టాండ్‌ను స్వాగతిస్తున్నారు. శివాజీ వ్యాఖ్యలపై వరుసగా సినీ ప్రముఖులు స్పందిస్తుండటంతో, ఈ అంశం టాలీవుడ్‌లోనే కాదు సోషల్ మీడియాలోనూ హాట్ టాపిక్‌గా మారింది. మొత్తంగా చూస్తే, 'దండోరా' సినిమా ప్రమోషన్ వేదికగా మొదలైన ఈ వివాదం ఇప్పుడు మహిళల గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రొఫెషనల్ వేదికలపై బాధ్యతాయుతమైన మాటల అవసరం వంటి అంశాలపై పెద్ద చర్చగా మారింది. తనపై వస్తోన్న విమర్శలపై శివాజీ స్పందిస్తారా లేదా అనేది చూడాల్సి ఉంది.


# తారక్ ప్రశాంత్ నీల్ సినిమాలో పవర్‌ఫుల్ రోల్‌లో బాలీవుడ్ హీరోయిన్!





టాలీవుడ్ మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో ఒక భారీ చిత్రం పట్టాలెక్కబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచే అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ముఖ్యంగా ఈ చిత్రంలో నటించే నటీనటుల గురించి రోజుకో వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ పాన్ ఇండియా ప్రాజెక్టులోకి ఒకప్పటి బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఎంట్రీ ఇవ్వబోతున్నారట. ఒకప్పుడు తన కళ్లతోనే కోట్లాది మందిని మాయ చేసిన ఆమె, ఇప్పుడు తారక్ సినిమాలో ఒక అత్యంత కీలకమైన మరియు పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారని సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ఇంతకీ ఆ బాలీవుడ్ బ్యూటీ ఎవరు?ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో కేవలం హీరోలను మాత్రమే కాదు, నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలను లేదా ఇతర కీలక పాత్రలను కూడా ఎంతో బలంగా డిజైన్ చేస్తారు. 'కేజీఎఫ్' లో రవీనా టాండన్ పాత్రను ఎంత పవర్‌ఫుల్‌గా చూపించారో మనందరికీ తెలిసిందే. ఇప్పుడు ఎన్టీఆర్ సినిమాలో కూడా అలాంటి ఒక బలమైన మహిళా పాత్ర కోసం సదరు బాలీవుడ్ సీనియర్ హీరోయిన్‌ను సంప్రదించారట. ఆమె చేసే పాత్ర సినిమా మలుపు తిరగడానికి ప్రధాన కారణం అవుతుందని సమాచారం. ఇప్పటికే ఆమెకు కథ చెప్పడం, ఆమె కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగిపోయాయని ఇండస్ట్రీ టాక్‌తారక్ తో మొదటిసారి. సదరు నటి ఇప్పటికే తెలుగులో కొన్ని సినిమాల్లో మెరిసినప్పటికీ, యంగ్ టైగర్ ఎన్టీఆర్‌తో కలిసి నటించడం ఇదే మొదటిసారి. బాలీవుడ్ లో ఇప్పటికీ తనకంటూ ఒక ప్రత్యేక క్రేజ్ ని నిలుపుకున్న ఈమె, తారక్ వంటి మాస్ హీరో సినిమాలో కనిపిస్తే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కాంబినేషన్ కుదిరితే ఉత్తరాది మార్కెట్‌లో కూడా సినిమాకు తిరుగులేని ఓపెనింగ్స్ వస్తాయని చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోంది. అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తున్న ఆ బాలీవుడ్ సీనియర్ స్టార్ మరెవరో కాదు.. కాజోల్! ఎన్టీఆర్ 31లో కాజోల్ ఒక కీలక పాత్ర పోషించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. సినిమాలో ఆమె పాత్ర నెగటివ్ షేడ్స్ లో ఉంటుందా లేక మరేదైనా పవర్ ఫుల్ పాత్రలో ఉంటుందా అనేది ప్రస్తుతం సస్పెన్స్‌గా మారింది. కాజోల్ ఎంట్రీ వార్త ఇప్పుడు ట్రేడ్ వర్గాల్లో సెన్సేషన్ సృష్టిస్తోంది. ప్రశాంత్ నీల్ యాక్షన్ మేకింగ్, తారక్ ఎనర్జీ, దానికి కాజోల్ లాంటి సీనియర్ నటి తోడైతే వెండితెరపై విజువల్ ఫీస్ట్ ఖాయమనిపిస్తోంది. మరి ఈ క్రేజీ కాంబో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో వేచి చూడాలి!


# పాటకు రూ.60 కోట్లు రెమ్యునరేషన్ తీసుకుంటున్న కేజీ బ్యూటీ!





ఆమె కేవలం తన డ్యాన్స్‌తోనే భారతీయ సినీ పరిశ్రమను ఉర్రూతలూగించింది. కెనడా నుంచి కేవలం రూ. 5000తో భారత్‌కు వచ్చి, ఇప్పుడు కోట్లలో సంపాదిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తో ది. ఒకప్పుడు అవకాశాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగిన ఈ భామ, ఇప్పుడు ఒక్కో స్పెషల్ సాంగ్ కోసం డిమాండ్ చేస్తున్న రెమ్యునరేషన్ వింటే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. బాలీవుడ్ అగ్ర హీరోల సినిమాల్లో ఐటమ్ సాంగ్స్ అంటే ఈమె ఉండాల్సిందే అన్నంతగా తన క్రేజ్‌ను పెంచుకుంది. అత్యంత తక్కువ కాలంలోనే కోట్లాది రూపాయల ఆస్తిని కూడబెట్టిన ఆ గ్లామర్ బ్యూటీ సంపాదన వివరాలు తెలుసుకుందాం. .ప్రస్తుతం ఒక్కో స్పెషల్ సాంగ్‌లో నటించడానికి దాదాపు రూ. 50 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు వసూలు చేస్తోంది ఈ హాట్? బ్యూటీ. కేవలం సినిమాలే కాకుండా, ప్రముఖ రియాలిటీ షోలకు జడ్జిగా వ్యవహరిస్తూ భారీగా ఆర్జిస్తోంది. ఒక్కో షో కోసం ఆమె తీసుకునే రెమ్యునరేషన్ కూడా లక్షల్లోనే ఉంటుంది. వీటితో పాటు బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా కూడా ఈమెకు భారీ ఆదాయం వస్తోంది. ఒక్కో ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌కు ఆమె రూ. 5 లక్షల వరకు ఛార్జ్ చేస్తుందట. అత్యంత ఖరీదైన కార్లు, విలాసవంతమైన ఫ్లాట్లు ఈమె సొంతం. ముంబైలో ఆమెకు కోట్లాది రూపాయల విలువైన ఒక అపార్ట్‌మెంట్ ఉంది. అలాగే వానిటీ వ్యాన్ నుంచి ఆమె వాడే హ్యాండ్ బ్యాగుల వరకు అన్నీ అంతర్జాతీయ బ్రాండ్లకు చెందినవే. కష్టపడి పైకొచ్చిన ఈ భామ, తన సంపాదనను రియల్ ఎస్టేట్ మరియు ఇతర వ్యాపారాల్లో కూడా పెట్టుబడిగా పెడుతోంది. ఇంతటి క్రేజ్ సంపాదించుకున్న ఆ డ్యాన్సింగ్ సెన్సేషన్ మరెవరో కాదు.. నోరా ఫతేహి! అవును, తన బెల్లీ డ్యాన్స్‌తో ఇంటర్నెట్‌ను ఊపేస్తున్న నోరా, ప్రస్తుతం సుమారు రూ. 52 కోట్ల నెట్ వర్త్ కలిగి ఉన్నట్లు సమాచారం. ప్రారంభంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ, నేడు బాలీవుడ్ లో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న నటీమణుల్లో ఒకరిగా ఎదగడం నిజంగా విశేషం. నోరా ఫతేహి ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. ప్రతిభ ఉంటే భాషా భేదం లేకుండా ఏ దేశంలోనైనా సత్తా చాటవచ్చని ఆమె నిరూపించింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో కూడా పలు భారీ చిత్రాల్లో ఆమె సందడి చేయబోతోంది.

# 'శంబాల'తో నా కెరీర్ టర్న్ అవుతుందన్న నమ్మకముంది



ప్రముఖ నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ సాయికుమార్ తనయుడిగా సినీ నేపథ్యం ఉన్నప్పటికీ స్వయంకృషితో కెరీర్‌ను నిర్మించుకుకుని తెలుగు చిత్ర పరిశ్రమలో తనదైన గుర్తింపును సంపాదించుకున్నాడు యువ నటుడు ఆది సాయికుమార్. 2011లో కె. విజయభాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ప్రేమ కావాలి' సినిమాతో హీరోగా వెండితెరకు పరిచయమైన ఆది, తొలి సినిమాతోనే విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. ఈ చిత్రంతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్న అతడు అదే ఏడాది దక్షిణాది ఫిలింఫేర్ అవార్డుల్లో ఉత్తమ నూతన నటుడిగా పురస్కారం అందుకోవడం విశేషం. అనంతరం 'లవ్‌లీ' వంటి చిత్రాలతో తన నటనా ప్రతిభను మరింత మెరుగుపరుచుకుంటూ ఎత్తుపల్లాల ప్రయాణంలోనూ ఇండస్ట్రీలో నిలదొక్కుకున్నాడు. తొలి రెండు చిత్రాల్లో విజయాలు అందుకుని ప్రేక్షకుల్ని మెప్పించిన ఆది ఆ తర్వాత సుమారు 20కి పైగా సినిమాల్లో నటించినా ఒక్కటి కూడా సరైన ఫలితం ఇవ్వకపోయినా నిరాశ చెందకుండా సినిమాలు చేస్తూనే ఉన్నాడు. ప్పుడు ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం ' శంబాల ' క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. స్టార్ హీరోలు లేకపోయినా కంటెంట్ ఆధారిత సినిమాలపై ఆసక్తి చూపే ప్రేక్షకుల దృష్టిని ఈ సినిమా ఆకర్షిస్తోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, ట్రైలర్‌లు సోషల్ మీడియాలో మంచి స్పందన రాబట్టాయి. ముఖ్యంగా పురాణాల నేపథ్యాన్ని సైన్స్‌తో మేళవించిన కాన్సెప్ట్ ఆసక్తికరంగా ఉందని సినీ విశ్లేషకులు మారింది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఆది ఇటీవల హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించాడు. తొలిసారి కథ విన్నప్పుడే 'శంబాల' అనే పేరు తనను ఆకట్టుకుందని ఆయన చెప్పాడు. పురాణాల్లో ప్రస్తావన ఉన్న శంబాల అనే పవిత్ర ప్రదేశం చుట్టూ సాగే కథ కావడం వల్ల ఈ ప్రాజెక్ట్‌ను చేయాలని బలంగా అనిపించిందని వివరించాడు. ప్రస్తుతం ప్రేక్షకులు కొత్త అనుభూతిని కోరుకుంటున్నారని, అలాంటి అంచనాలకు తగ్గట్టుగా ఈ సినిమా రూపొందిందని పేర్కొన్నాడు. 'శంబాల'లో తాను జియాలజిస్ట్ పాత్రలో కనిపించనున్నట్లు ఆది వెల్లడించాడు. ఒక గ్రామంలో పడిన ఉల్కపై పరిశోధన కోసం జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నుంచి శంబాలకు వెళ్లే పాత్ర తనదని, ఆ తర్వాత జరిగే సంఘటనలే కథలో ప్రధాన మలుపులని చెప్పాడు. 1980ల కాలం నేపథ్యంలో కథ సాగుతుండటంతో లుక్, కాస్ట్యూమ్స్, ప్రొడక్షన్ డిజైన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని వివరించాడు. విజువల్ ఎఫెక్ట్స్ కూడా సినిమాకు ప్రధాన బలమని పేర్కొన్నాడు.

Publisher, Owner And Editor Boddupally Mallaiah 3-62, Yendabetla, Nagarkurnool, Telangan - 509209,
Printer, Gundur Shyam , Shyam Agencies Telkapally(M), Telangana 509385. Published 2-48/1 Near Hanuman Temple, Telkapally(M) Dist.Nagarkurnool, Telangana 509385.
Ph 9441946907, Email : nijamenijayithi@gmail.com Website : nijamenijayithi.com